తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-08-అక్టోబర్-2025 | సంపుటి:3 | సంచిక:131 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in

## నేను మంత్రి కావడం
# మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా..?

- మంత్రులు అడ్లూరి, పొన్నం మధ్య వివాదం
- త్వరలోనే సోనియాగాంధీ, రాహుల్, ఖర్గే, మీనాక్షి నటరాజన్‌ను కలుస్తా.. : అడ్లూరి లక్ష్మణ్
- వివాదాన్ని మరింత జటిలం చేయవద్దు : మహేశ్‌కుమార్ గౌడ్



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ప్రచారంపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పందించారు. తనపై చేసిన వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ స్పందించాలని డిమాండ్ చేశారు. తాను పక్కన ఉంటే మరో మంత్రి వివేక్ ఓర్చుకోవడం లేదని, లేచి వెళ్లి పోతున్నారని ఆరోపించారు. పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం తనకు రాదని అన్నారు. ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నానని ఇప్పటికీ మారకపోతే తర్వాత జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని అడ్లూరి వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..

## ప్రాణహిత – చెవెళ్ల ప్రాజెక్టుపై
# ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

- కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం కొనసాగిస్తున్నం
- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రాణహిత చెవెళ్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉద్ఘాటించారు. తుమ్మడిహట్టి వద్ద రెండు ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశీలిస్తున్నట్లు చెప్పుకొచ్చారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణలో ఐఐటీని భాగస్వామ్యం చేస్తామని వెల్లడిరచారు.

మిగతా 2లో..

## రేవంత్ రెడ్డి మాటలు
# కోటలు దాటితే.. చేతలు గడప దాటవు



- మూడు వారాలు దాటినా జీతాలు రావట్లేదు
- బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది పడుతున్న నరకయాతనే నిదర్శనం
- ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం తప్ప ఆచరించింది లేదు
- ఎమ్మెల్యే హరీశ్‌రావు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటవు అనడానికి వేతనాలు అందక టీవీవీపీ, బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది పడుతున్న నరకయాతనే నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం తప్ప ఆచరించింది లేదు, అమలు చేసింది లేదు.

మిగతా 2లో..

## ఆ మంత్రి నాపై చేసిన
# వ్యాఖ్యలకు స్పందించను!

- అడ్లూరి వ్యాఖ్యలపై స్పందించబోనన్న పొన్నం ప్రభాకర్
- పార్టీ పరంగా మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన ఆదేశాలు పాటిస్తానని స్పష్టీకరణ



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తనను అహంకారిగా అభివర్ణిస్తూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తనతో మాట్లాడారని, ఆయనతో జరిగిన సంభాషణే ఫైనల్ అని పొన్నం తెలిపారు. రహ్మత్ నగర్ సమావేశంలో చోటుచేసుకున్న విషయాలను పీసీసీ అధ్యక్షుడికి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ పరంగా మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన ఆదేశాలను తప్పకుండా పాటిస్తానని ఆయన అన్నారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల గురించి ప్రశ్నించగా అడ్లూరి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు.

మిగతా 2లో..

# తీన్మార్ మల్లన్నకు హైకోర్టులో ఊరట



- ఇటీవలే తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించిన మల్లన్న
- స్థానిక ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించాలని వినతి
- మల్లన్న అభ్యర్థనను పరిశీలించాలని ఈసీకి హైకోర్టు ఆదేశం

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన పార్టీ గుర్తింపు, గుర్తుకు సంబంధించిన అభ్యర్థనను పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న మల్లన్నకు ఊరట లభించినట్లయింది.

మిగతా 2లో..

# రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

- కేవలం కొంత నగదు మాత్రమే రికవరీ
- సైబర్ మోసాలపై అప్రమత్తత
- పోలీసుల కీలక సూచనలు



ప్రస్తుతం సమాజంలో స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ మన రోజువారీ జీవితంలో ప్రధాన భాగమైపోయాయి. అయితే, సాంకేతికతతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. ఇటీవల సైబర్ మోసాలు గణనీయంగా పెరిగాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఈ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ప్రజలను అప్రమత్తంగా ఉండేలా పలు సూచనలు చేశారు. ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబర్ వరకు నిజామాబాద్ జిల్లాలో 33 సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఈ సమయంలో బాధితులు మొత్తం రూ.4.92 కోట్లు మోసపోయారు. ఆ మొత్తంలో రూ.87 లక్షలు మాత్రమే రికవరీ అయ్యాయి.

మిగతా 2లో..

## జూబ్లీహిల్స్ రేసులో లేనన్న
# బొంతు రామ్మోహన్

- అధిష్ఠానం పరిశీలనలో బొంతు రామ్మోహన్ పేరు!
- అయితే, తాను టికెట్ కోసం ఎవరినీ అడగలేదన్న బొంతు
- ఎవరిని బరిలో దింపినా సపోర్ట్ చేస్తానని వెల్లడి



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ అధికార కాంగ్రెస్ పార్టీలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుండగానే, టికెట్ ఆశిస్తున్న ఇద్దరు కీలక నేతలకు సంబంధించిన వార్తలు పార్టీలో కలకలం రేపుతున్నాయి. బరిలో ఉంటారని భావించిన ముఖ్య నేతల్లో ఒకరు పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించగా, మరొకరు క్రిమినల్ కేసులో చిక్కుకున్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తున్న వారిలో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్. అయితే, తాను అభ్యర్థిత్వ రేసులో లేనని ఆయన స్పష్టం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## నేను మంత్రి కావడం
# మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా..?

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే సోనియాగాంధీ, రాహుల్, ఖర్గే, మీనాక్షి నటరాజ్‌ను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ వెల్లడిరచారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అన్నారు. తాను మంత్రి కావడం మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం తనకు రాదని అన్నారు. ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నానని, పొన్నం మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనదే బాధ్యతని వెల్లడిరచారు. పొన్నం వ్యాఖ్యలపై ఖర్గే, మీనాక్షికి లేఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రాశారు. పొన్నం ప్రభాకర్ తీరుపై ఫిర్యాదు చేశారు. త్వరలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఖర్గేను కలుస్తానన్న అడ్లూరి రేపటిలోగా పొన్నం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌ల మధ్య తలెత్తిన వివాదంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఇద్దరి మధ్య చోటు చేసుకున్న వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరగడం పొన్నం వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి స్పందించడంతో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జోక్యం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ ఉదయం ఇద్దరితో ఫోన్‌లో మాట్లాడి వివాదాన్ని మరింత జటిలం చేయవద్దని సూచించినట్లు సమాచారం. ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని ఒకరికొరు సహకరించుకోవాలని చెప్పినట్లుగా పీసీసీ వర్గాలు తెలిపాయి. పీసీసీ అధ్యక్షుడిగా జోక్యం చేసుకోవడంతో ఇద్దరు మంత్రుల మధ్య చోటు చేసుకున్న వివాదానికి తెరపడినట్లు పార్టీ వర్గాలు వెల్లడిరచాయి.

## రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే..
# చేతలు గడప దాటవు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ వైద్య విధాన పరిషత్ రెగ్యులర్ ఉద్యోగులకు ప్రతి నెలా రెండు, మూడు వారాలు దాటినా జీతాలు రాని పరిస్థితి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకైతే నెలల తరబడి జీతాలు అందని దుస్థితి. ఇక బస్తీ దవాఖాన వైద్య సిబ్బందికి అయితే ఆరు నెలలుగా వేతనాలు పెండిరగ్ పెట్టి, చుక్కలు చూపిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని హరీశ్‌రావు మండిపడ్డారు. వైద్యులకు, ఇతర సిబ్బందికి బతుకమ్మ, దసరా పండుగ సంబురం లేకుండా చేసి, వారిని మానసిక క్షోభకు గురి చేయడం తగునా? వేతనాలు ఇవ్వాలని ఎన్నిసార్లు అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవడం దుర్మార్గం. అత్యవసర సేవలు అందించే వైద్య సిబ్బందికే జీతాలు ఇవ్వకుంటే, ఇక ఇతర శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? పథకాల్లో కోతలు.. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా వాతలు పెడుతున్నారు. మాటల్లో ఫేకుడు.. ఢల్లీకి వెళ్లి జోకుడు.. ఇదే కదా రేవంత్ రెడ్డి 22 నెలల్లో నువ్వు చేసింది. నీ పాలన వైఫల్యం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు శాపంగా మారింది. జీతాలు ఇవ్వకుండా 13 వేల మంది వైద్య సిబ్బందికి దసరా పండుగ దూరం చేశావు. కనీసం ఇప్పుడైనా జీతాలు ఇచ్చి వారికి దీపావళి సంబురాన్ని అందించు అని సీఎంకు హరీశ్‌రావు సూచించారు.

# రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలు

(మొదటి పేజీ తరువాయి)

అంటే సుమారు 17.72 శాతం మాత్రమే మోసపోయిన డబ్బును తిరిగి పొందగలిగారు. సైబర్ మోసాలు ఎప్పుడు, ఎక్కడ జరిగే అవకాశముందో చెప్పడం కష్టం. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య పేర్కొన్నట్టు, సైబర్ మోసానికి గురైనవారు వెంటనే "గోల్డెన్ అవర్"లో అంటే మోసం జరిగి గంటలోపు 1930 లేదా డయల్ 100కి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే, వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చు. ఫిర్యాదు వేగంగా చేయకపోతే, నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని, అప్రమత్తత లేకపోతే పరిస్థితులు గందరగోళంగా మారుతాయని ఆయన హెచ్చరించారు. జిల్లాలో ఎక్కువగా సైబర్ మోసాలు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్నాయి. మోసగాళ్లు స్టాక్ మార్కెట్ పెట్టుబడులు, ఏపీకే ఫైల్స్, పోలీసులు, ఈడీ, ఇన్కంట్యాక్స్ వంటి అధికారుల పేర్లను తప్పుగా ఉపయోగించి నోటీసులు పంపడం, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు చేయడం వంటి పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారు. చాలా మంది తమ అనుభవం లేకపోవడం, మోసపోయే పరిస్థితుల్లో ఎటువంటి సహాయం కోరాలో తెలియకపోవడం వల్ల భారీ మొత్తాలు నష్టపోతున్నారు. కేవలం క్షణాల్లో లక్షల రూపాయల వరకు వారి ఖాతాల నుంచి డబ్బులు కొల్లగొడుతున్నారు.

ఇలాంటి సంఘటనల్లో మోసగాళ్లు ఎంత తెలివిగా, భయానకంగా ప్రజలను మోసం చేస్తున్నారో స్పష్టంగా చూపిస్తున్నాయి. అందుకే స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసర లింకులు, తెలియని వ్యక్తుల మెసేజులు, ఆన్‌లైన్ వ్యాపారాల ఆఫర్లు నుంచి ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎటువంటి సందేహాలు ఉంటే వాటిని వెంటనే పోలీసులకు తెలియజేసి ఫిర్యాదు చేయాలి. సైబర్ మోసాలకు గురవకుండా ఉండేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరికైనా డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, బ్యాంకు ఖాతాల గురించి అప్రమత్తత లేకుండా సంభ్రమంలో పడకుండా, అధికారిక ఫిర్యాదు కేంద్రాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కరించుకోవాలని సలహా అందిస్తున్నారు.

## జూబ్లీహిల్స్ రేసులో లేనన్న
# బొంతు రామ్మోహన్

(మొదటి పేజీ తరువాయి)

తాను టికెట్ కోసం ఎవరినీ అడగలేదని, పార్టీ అధిష్టానం ఎవరిని బరిలోకి దింపినా వారి గెలుపు కోసం పూర్తిస్థాయిలో పనిచేస్తానని ఆయన తెలిపారు. పార్టీ సిఫారసు చేసిన జాబితాలో ఆయన పేరు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఒకవైపు బొంతు రామ్మోహన్ ఇలా ప్రకటించగా, మరోవైపు టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నెల 4న యూసుఫ్‌గూడలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓటరు కార్డులను పంపిణీ చేశారన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు సోమవారం నవీన్ యాదవ్‌పై బీఎన్ఎస్ సెక్షన్లు 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేశారు.

దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్‌కు ఉప ఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా గోపీనాథ్ సతీమణి సునీతను ఇప్పటికే ప్రకటించింది. కాంగ్రెస్ నుంచి బొంతు రామ్మోహన్, నవీన్ యాదవ్‌లతో పాటు సీఎన్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, కాంగ్రెస్ అధిష్టానం జూబ్లీహిల్స్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 11న పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు జరగనున్న ఈ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది.

## ప్రాణహిత – చెవెళ్ల ప్రాజెక్టుపై
# ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

వర్షాకాలం అనంతరం రూపకల్పన చేసి ఒక సంవత్సరంలో వీటిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ విచారణ పురోగతిపై సమీక్షించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. సమ్మక్క సారక్క ప్రాజెక్టు, దేవదుల ప్రాజెక్టులపై సమీక్షించారు. భూ సేకరణ పరిహారంగా రూ.33 కోట్లు విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. డిరడి ప్రాజెక్టుపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. రిజర్వాయర్ల సామర్థ్య పెంపు కోసం కొత్త విధానం సిద్ధం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఐఎస్‌డబ్ల్యూఆర్డ్, సీడీఓ బలోపేతంపై ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

# తీన్మార్ మల్లన్నకు హైకోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల తాను స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీకి గుర్తింపునిచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు గుర్తును కేటాయించాలని కోరుతూ తీన్మార్ మల్లన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకుని, నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. తెలంగాణలో బీసీలకు రాజ్యాధికారం దక్కాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎరుపు, ఆకుపచ్చ రంగుల జెండా మధ్యలో పిడికిలి, కార్మిక చక్రం, వరి కంకులతో పార్టీ పతాకాన్ని రూపొందించారు. 'ఆత్మగౌరవం, అధికారం, వాటా' అనే నినాదాలను జెండాపై ముద్రించారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో పార్టీ గుర్తింపు, గుర్తు కేటాయింపునకు గల అవకాశాలను ఎన్నికల సంఘం పరిశీలించనుంది.

# ఆ మంత్రి నాపై చేసిన వ్యాఖ్యలకు స్పందించను!

(మొదటి పేజీ తరువాయి)

పొన్నం మాదిరిగా అహంకారపూరితంగా మాట్లాడటం తనకు రాదని ఆయన అన్నారు. పొన్నం తన వైఖరిని మార్చుకోకపోతే జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలోనే పార్టీ పెద్దలను కలుస్తానని కూడా ఆయన తెలిపారు. పొన్నంపై అడ్లూరి లక్ష్మణ్ బహిరంగంగా విమర్శలు చేయడంతో పీసీసీ చీఫ్ స్పందించారు. అడ్లూరి లక్ష్మణ్‌కు ఫోన్ చేసి ఇరువురు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అడ్లూరి లక్ష్మణ్ తనపై చేసిన వ్యాఖ్యల మీద స్పందించేందుకు పొన్నం ప్రభాకర్ నిరాకరించారు.

## పొన్నం ప్రభాకర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు


- **అడ్లూరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు**
- **అట్రాసిటీ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**
- **కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం**

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు దాఖలైంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకు ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సహచర మంత్రి అన్న విజ్ఞత లేకుండా, ప్రజల్లో ఉన్నామనే ఆలోచన లేకుండా మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి లక్ష్మణ్‌ను దూషించడం సరికాదని, దీనిని తాము ఖండిస్తున్నామని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను తక్షణమే సుమోటోగా స్వీకరించి అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు కమిషన్ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శిల దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు.

# ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

**ప్రియుడు మృతి.. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న పియురాలు**



జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం తాడికొండ గ్రామంలో ప్రేమజంట సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా ప్రియుడు మృతి చెందాడు. ప్రియురాలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, మండలంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. తాటికొండ గ్రామానికి చెందిన మారపాక అంజయ్య, రేణుకులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు మానసిక వికలాంగుడు. పెద్ద కుమారుడు అన్వేష్(26), కూతురు పెళ్లి చేశారు. నిరుపేద చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఈ కుటుంబం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. కాగా హనుమకొండ జిల్లా, ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన గడ్డం దాసు, ఎలిషా దంపతులకు ఒక కుమారుడు కాగా, కూతురు లేకపోవడంతో పావని అనే అమ్మాయిని చిన్నప్పటినుండే సాదుకున్నారు. పావని తండ్రి దాసు సంవత్సరం క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అన్వేష్‌కు, పావనికి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇరువురు పెళ్లి చేసుకోవడానికి నిశ్చయించుకుని అమ్మాయిని గత మూడు నెలల క్రితమే అబ్బాయి తన ఇంటికి తీసుకు వచ్చాడు. అప్పటినుండి అందరూ అదే ఇంటిలో కలిసి ఉంటున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు సైతం నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో పెళ్లి ఖర్చులు భరించి పెళ్లి చేయడానికి ఇరువురి కుటుంబాలు గత రెండు నెలల రోజుల క్రితమే అంగీకరించాయి. ఈలోగా అబ్బాయి అక్క కొడుకు మృతి చెందడంతో వీరికి చుట్టు రావడం, తర్వాత వినాయక చవితి పండుగ రావడం అటు తరువాత అబ్బాయి బంధువులు చనిపోవడం మళ్ళీ చుట్టు రావడంతో పెళ్లి వాయిదా పడుతూ వచ్చింది. ఇలా వీరి పెళ్లికి ఏదో ఒకటి అడ్డంకి రావడంతో ఈ ప్రేమ జంట అన్వేష్, పావనీల మధ్య గత వారం రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం వారి పాత ఇంటిలో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగి ప్రేమ జంట ఆత్మహత్యానికి పాల్పడ్డారు. వీరిని చూసిన అబ్బాయి తల్లి బంధువులకు, ఇరుపక్కల వారికి తెలుపగా, వారిని చికిత్స నిమిత్తం వరంగల్ యంజీయం తరలించారు. కాగా మంగళవారం ఉదయం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో అన్వేష్ మృతిచెందగా, పావని చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉత్తర బెంగాల్ లో బీజేపీ నేతలపై దాడి

- **రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ విమర్శ**
- **విపత్తును రాజకీయం చేస్తున్నారంటూ సీఎం మమతా బెనర్జీ ఫైర్**
- **భారీ వర్షా లు, కొండచరియలు విరిగిపడటంతో 30 మందికి పైగా మృతి**
- **బాధితులకు రూ. 5 లక్షల పరిహారం ప్రకటించిన మమతా సర్కార్**

పశ్చిమ బెంగాల్‌లో ప్రకృతి విపత్తు రాజకీయ రంగు పులుముకుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఇద్దరు బీజేపీ నేతలపై దాడి జరగడంతో, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం మొదలైంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించగా, విపత్తును అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా బదులిచ్చారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులు ఉత్తర బెంగాల్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. ఈ ఘటనల్లో ఇప్పటివరకు 30 మందికి పైగా మరణించగా, పలువురు గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం జల్‌పాయ్‌గురి జిల్లాలోని నాగర్‌కాటాలో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెళ్లిన బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము, సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌లపై స్థానికులు దాడి చేశారు. ఈ దాడిలో ఎంపీ ముర్ము ముఖం, ముక్కు నుంచి రక్తం కారుతున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ దాడి వెనుక తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారని బీజేపీ ఆరోపించగా, ప్రతిపక్షాలు చేస్తున్న "ఫొటోఆప్ రాజకీయాల" వల్లే ప్రజాగ్రహం వ్యక్తమైందని టీఎంసీ కొట్టిపారేసింది. ఈ దాడి ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. "వరద బాధితులకు సేవ చేస్తున్న మా పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేపై జరిగిన దాడి దిగ్భ్రాంతికరం. ఇది ఇతరుల భావాలను పట్టించుకోలేని టీఎంసీ తత్వాన్ని, రాష్ట్రంలో దారుణంగా ఉన్న శాంతిభద్రతల పరిస్థితిని తెలియజేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రధాని విమర్శలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అంతే ఘాటుగా బదులిచ్చారు. "విపత్తు సమయంలో ప్రజలు కష్టాల్లో ఉంటే, ప్రధాని ఎలాంటి విచారణ లేకుండా ఈ ఘటనను రాజకీయం చేయడం దురదృష్టకరం. ఎలాంటి ఆధారాలు, విచారణ నివేదికలు లేకుండానే టీఎంసీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం" అని ఆమె 'ఎక్స్'లో స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, రాజకీయ వేదికల నుంచి చేసే ట్వీట్లతో నేర నిర్ధారణ జరగదని ఆమె హితవు పలికారు. ఈ ఘటనపై బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను పునరుద్ధరించాలని సూచించారు. మరోవైపు, ఈ విపత్తు కారణంగా డార్జిలింగ్, మీరిక్ వంటి ప్రాంతాల్లో అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. బాధితుల కుటుంబాలకు రూ. 5 లక్షల నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి హోంగార్డు ఉద్యోగం ఇస్తామని మమతా బెనర్జీ ప్రకటించారు.

# నల్గొండలో మైనర్ విద్యార్థిని హత్యాచారం

**ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హత్యాచారం**



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు నల్గొండ పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. నల్గొండలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అత్యాచారం, హత్యకు గురైంది. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో ఓ ఇంట్లో యువతి మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఉదయం స్థానికుల నుంచి సమాచారం అందుకున్న నల్గొండ వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపి, చనిపోయిన యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న తమ కుమార్తె మృతదేహాన్ని చూసి బోరుమన్నారు. ఈ కేసులో ముందుగా అనుమానాస్పద మృతిగా భావించినా తరువాత అత్యాచారం చేసి హత్య చేసినట్లుగా గుర్తించి కేసు నమోదు చేశారు. నిందితుడు గడ్డం కృష్ణ కోసం గాలిస్తున్నట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితుని సెల్‌ఫోన్ డేటా ఆధారంగా పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న గడ్డం కృష్ణ(22) గా పోలీసులు భావిస్తున్నారు. ఉదయం ఆమెను తన స్నేహితుడి గదికి తీసుకెళ్లి హత్యాచారం చేసినట్లు తెలిపారు. నిందితుడు గడ్డం కృష్ణపై వన్ టౌన్ పీఎస్‌లో రేప్, పోక్సో కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు. ఘటనలో ఇంకా ఎవరెవరున్నారు అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారని పేర్కొన్నారు. సాక్ష్యాధారాలను సేకరించి దోషులకు త్వరగా శిక్షపడే విధంగా కృషి చేస్తామని అన్నారు. కాగా నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గడ్డం కృష్ణతో పాటు సహకరించిన అతని స్నేహితుడిపై కూడా పోలీసులు కేసు నమోదుచేశారు.



## 15వ పటాలములో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**సత్తుపల్లి, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మండలం బి.గంగారం గ్రామంలోని 15వ పటాలములో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆదికవిగా, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మహాకవిగా రామాయణ మహాకావ్యాన్ని రచించారని, ఆయన ఆచార-విచారాలు ప్రతి భారతీయుడు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఇలాంటి మహనీయుల జయంతులు జరుపుకోవడం ద్వారా యువతకు స్ఫూర్తి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు దళాధిపతి ఏ.అంజయ్య, సహాయ దళాధిపతులు వై.శ్రీధర్ రాజా, వై.డి.రంగారెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి సరికాదు - మాజీ ఎంపీ నామ

- **సుప్రీం కోర్టు సీజేఐ పై దాడి పట్ల మాజీ ఎంపీ నామ ఖండన**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;**



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి సంఘటనను బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. న్యాయవ్యవస్థపై దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ తెస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలు సరికాదన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తిపై దాడి ప్రయత్నం జరగడం ఆందోళనకరమని నామ అన్నారు. ప్రజల న్యాయహక్కులను కాపాడే న్యాయమూర్తులపై దాడి ప్రయత్నం దేశ ప్రజాస్వామ్య గౌరవాన్ని దెబ్బతీసిన చర్యగా అభివర్ణించారు. దాడి యత్నం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. న్యాయమూర్తుల భద్రతను మరింత పటిష్టపరిచి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టడంలో ప్రభుత్వం, న్యాయవర్గాలు, ప్రజాసంఘాలు సమన్వయంతో ముందుకు రావాలని నామ పేర్కొన్నారు.



## కొమురం భీమ్‌కు హైడ్రా కమిషనర్ ఘన నివాళి

**హైదరాబాద్,అక్టోబర్7 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానాయకుడు కొమురం భీమ్‌ను స్మరించుకుంటూ హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఘన నివాళులర్పించారు.కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవం తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రంగనాథ్ "కొమురం భీమ్ పోరాటం సామాజిక న్యాయం, స్వాభిమానం కోసం ప్రతి తరానికి ప్రేరణగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.

**హైడ్రా కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి**

హైడ్రా కార్యాలయంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మం, న్యాయం, సత్యం, సేవా మార్గాలను ప్రపంచానికి చాటి చెప్పిన వాల్మీకి మహర్షి స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శమని కమిషనర్ అన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు బోనకల్ ఎం. జె .పి కళాశాల విద్యార్థి సాయికిరణ్ ఎంపిక....

- **జిల్లాస్థాయిలో ప్రతిభను కనపరిచిన సాయికిరణ్ అభినందించిన ఆర్. సి. ఓ రాంబాబు, ప్రిన్సిపాల్ సుష్మ (డి.సి.ఒ)...**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;**



బోనకల్ ఎం జె పి కళాశాల విద్యార్థి అయిన సాయి కిరణ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. మంగళవారం జిల్లా స్థాయిలో నిర్వహించినటువంటి కబడ్డీ పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా ఆర్సిఓ రాంబాబు, ప్రిన్సిపల్ సుష్మ (డిసిఒ) మాట్లాడుతూ కళాశాల విద్యార్థి అని రంగాలలో తమ ప్రతిభతో ముందుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. విద్యార్థి అభిరుచులను పరిగణలోకి తీసుకొని వారి ఆసక్తికి తగిన శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్స్ అయినటువంటి పి. వెంకటేశ్వర్లు, జి.రవి ని కూడా కళాశాల యాజమాన్యం అభినందించడం జరిగింది. కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ అయినటువంటి పి. వెంకటేశ్వర్లు ,జి.రవి మాట్లాడుతూ సాయికిరణ్ క్రీడల మీద ఉన్న ఆసక్తి వలన తను తాము చెప్పిన విధంగా క్రీడల పట్ల మేలుకోవాలని నేర్చుకోవడం వల్ల నిరంతరం తను ప్రేమించడం వల్ల ఈ యొక్క విజయాన్ని సాధించగలిగాడని వారు వివరించడం జరిగింది. ఇట్టి విజయాన్ని సాధించిన టువంటి సాయికిరణ్ ను కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయుని బృందం కూడా అభినందించడం జరిగింది.

# ప్రతి గడపలో బిజెపి నినాదం ప్రతిధ్వనించాలి

- **ఎన్నిక ఏదైనా విజయమే మన లక్ష్యం.**
- **కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందుంచాలి.**
- **బిజేపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;**



"భారతీయ జనతా పార్టీ నినాదం ప్రతి గడపలో ప్రతిధ్వనించాలి... ప్రజల మనసుల్లో విశ్వాసాన్ని నింపాలి" అని బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నూతనంగా నియమితమైన జిల్లా కార్యవర్గ సభ్యులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పార్టీ పటిష్ఠత, ప్రజల మద్దతు, క్రమశిక్షణపై విస్తృతంగా చర్చించారు.

జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ, బిజెపి ఇక కోటల్లో లేదా కార్యాలయాల్లో కాదు, గడపగడపలో ఉండాలని చెప్పారు. "బిజెపి ఎక్కడుంది అని ప్రశ్నించే వారికి ఇప్పుడు సమాధానం ఒక్కటే - ప్రతి గడపలో బిజెపి ఉంది. ప్రతి ఇంటిలో మోడీ ఆలోచనలే మారుమ్రోగాలి" అని ఆయన ఉత్సాహంగా వ్యాఖ్యానించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. రోజుకు కనీసం 14 గంటలు పార్టీ కోసం కేటాయించాలి, గ్రామస్థాయి నుండి పట్టణాల వరకు ప్రతి ఓటరుతో సంబంధం పెంచుకోవాలి అని చెప్పారు.

ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను బలంగా ప్రస్తావించారు. "ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. హామీలు ఇచ్చి ఆచరణలో విఫలమైంది. కానీ బిజెపి ఇచ్చిన మాట వృథా కాదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతోంది. ప్రజలకు ఈ సత్యం తెలియజేయడం ప్రతి బిజెపి కార్యకర్త బాధ్యత" అని ఆయన అన్నారు.

"ఎన్నిక ఏదైనా - అది గ్రామపంచాయతి అయినా, మున్సిపల్ ఎన్నిక అయినా లేదా పార్లమెంట్ అయినా - విజయం మాత్రం మనదే కావాలి. ఓటు శాతం కంటే విశ్వాస శాతం పెరగాలి. ప్రజల మనసుల్లో బిజెపి విశ్వాసాన్ని నింపాలి. క్రమశిక్షణ, కృషి, కృతనిశ్చయం - ఇవే మన పార్టీ బలం. మనం పాదాలమీద నిలబడి పనిచేస్తే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించగలుగుతాం" అని ఆయన స్పష్టం చేశారు.

జిల్లా కమిటీ నాయకులు తమ పరిధిలోని శక్తి కేంద్రాలను క్రమం తప్పకుండా పరిశీలించి వాటిని బలోపేతం చేయాలని సూచించారు. "ప్రజలకు ఉన్న సమస్యలను క్రమం తప్పకుండా గుర్తించండి, వాటి పరిష్కారం కోసం అధికారులతో చర్చించండి. సమస్య పరిష్కారమే మన పార్టీ పట్ల ప్రజల్లో నమ్మకం పెంచే మార్గం" అని చెప్పారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి స్థానంలో బిజెపి పోటీ ఖాయం అని వెల్లడించారు. "ఎవరెవరు ఎక్కడ పోటీ చేయాలనుకుంటున్నారో వివరాలను వెంటనే పంపించండి. అర్హులైన వారికి తగిన అవకాశాలు ఇవ్వబడతాయి. ప్రతి స్థానంలో గెలవడం లక్ష్యంగా ముందుకెళ్లాలి" అని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు నూతన కమిటీ సభ్యులందరినీ అభినందించి సన్మానించారు. నూతనంగా నియమితమైన కార్యవర్గ సభ్యులు పార్టీ పట్ల తమ కృతజ్ఞతలు తెలియజేసి, జిల్లా అధ్యక్షుడి మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, నలగట్టు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





## అమెరికాలో వేమన శతకం బోధన... మాతృభాషకు ప్రాధాన్యం

**సత్తుపల్లి, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**

డల్లాస్ (అమెరికా): విదేశాల్లో నివసిస్తున్న తెలుగు కుటుంబాలు తమ పిల్లలకు మాతృభాషా బోధనలో భాగంగా వేమన శతక పద్యాలను కూడా నేర్పుతున్నారు. సత్తుపల్లి పట్టణానికి చెందిన అయ్యదేవర శేషగిరిరావు, మాదిరాజు మాలతి దంపతులు సోమవారం అమెరికా టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ పట్టణంలో గల కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో సృజన సాహితీ సమాఖ్య పంపిన వేమన శతక పుస్తకాలను అందజేశారు.

శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి స్థాపించిన ఈ దేవాలయంలో ప్రతి ఆదివారం "బాలదత్త" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో బాల రామాయణం, బాల భారతం వంటి పురాణ కథలతోపాటు మాతృభాష బోధన కూడా జరుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మాతృభాషా పఠనానికి ఉపయోగించే వేమన శతకం తోపాటు బాల సాహితీవేత్త ఉరిమళ్ల సునంద రచించిన తెలుగు వాచక పుస్తకాలను స్వచ్ఛంద శిక్షకులు దీప్తి, శరణ్యలకు శేషగిరి దంపతులు అందజేశారు.

విద్యార్థులకు మాతృభాషా బోధనలో ఈ పుస్తకాలను ఈ సంవత్సరం నుండి ఉపయోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పుస్తకాలను పంపిన సృజన సాహితీ సమాఖ్యకు, రచయిత ఉరిమళ్ల సునందకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాయి ప్రకాష్, కౌశిక్ మరియు తెలుగు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.





## బోదులబండలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం..

- **వైరా కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత శిబిరం..**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;**

నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, లయన్స్ ఐ హాస్పిటల్, వైరా ఆధ్వర్యంలో మంగళవారం నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిభిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిభిరంలో సుమారు 250మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 50మందికి కంటి అపరషన్స్ గుర్తించారు. భక్తరామదాసు సర్వీస్ సొసైటీ వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు లయన్స్ కంటి ఆసుపత్రి చేస్తున్న సేవలను అభినందించారు. లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఐ హాస్పిటల్ చైర్మన్, ఐ హాస్పిటల్ నిర్వాహకులు లయన్ శ్యాంబాబు ఉండ్రు, డాక్టర్ రవిచంద, కంటి ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కొర్లకుంట నాగేశ్వరరావు, క్యాంపు చైర్మన్ గెల్లా జగన్మోహన్ రావు, , వైస్ చైర్మన్ బెల్లంపల్లి శ్రీనివాస్, కో చైర్మన్ కనపర్తి కోటేశ్వరరావు, ప్రెసిడెంట్ ఏటుకూరి వెంకటరామారావు, సెక్రటరీ గెళ్ళ వెంకటరమణ గుప్తా, ట్రెజరర్ దండా రవీంద్రబాబు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎం. జె.పి. బోనకల్ కళాశాల విద్యార్థి ఎంపిక....

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;**



బోనకల్ ఎం. జె. పి కళాశాల విద్యార్థి అయిన వి. కొండలరావు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. మంగళవారం జిల్లాస్థాయిలో నిర్వహించినటువంటి ఆర్చరీ క్రీడల్లో చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా ఆర్. సి. ఓ రాంబాబు, ప్రిన్సిపల్ సుష్మ (డిసిఓ) మాట్లాడుతూ కళాశాల విద్యార్థి అన్ని రంగాలలో తమ ప్రతిభతో ముందుండి ఈరోజు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. విద్యార్థి అభిరుచులను పరిగణలోకి తీసుకొని వారి ఆసక్తికి తగిన శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్స్ అయినటువంటి పి. వెంకటేశ్వర్లు, జి. రవి ని కూడా కళాశాల యాజమాన్యం అభినందించడం జరిగింది. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అయినటువంటి పి. వెంకటేశ్వర్లు ,జి. రవి మాట్లాడుతూ వి. కొండలరావు క్రీడల మీద ఉన్న ఆసక్తి వలన తను తాము చెప్పిన విధంగా క్రీడల పట్ల మెలకువలను నేర్చుకోవడం వల్ల నిరంతరం తను శ్రమించడం వల్ల ఈ యొక్క విజయాన్ని సాధించగలిగాడని వారు వివరించడం జరిగింది. ఇట్టి విజయాన్ని సాధించినటువంటి కొండలరావుని కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయుని బృందం అభినందించడం జరిగింది.

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

**దేవిడ్ రాజు ఉద్యమకారుడు కొత్తకోట**

**కొత్తకోట,అక్టోబర్7 (తెలంగాణ ముచ్చట్లు):**



దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ పై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యమకారుడు డేవిడ్ రాజు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు రక్షణ ఎంత ఉన్నదో అనే ప్రశ్నను రేకెత్తిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.డేవిడ్ రాజు ప్రకటన ప్రకారం, సుప్రీంకోర్టులో ఒక కేసు విచారణ జరుగుతుండగా, బాధ్యత గల న్యాయవాది తన వృత్తి, సనాతన ధర్మాన్ని కలలంఖం చేయడానికి ప్రయత్నించడం హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి తన సమస్యలపై చట్టప్రకారం కోర్టులో పిటిషన్ ద్వారా పోరాడాలి. కానీ ఇలా మూర్ఖత్వంతో, చట్టాలను ఉల్లంఘిస్తూ, ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి పాల్పడటం సరిగా లేదు అని ఆయన చెప్పారు. అయితే, ఈ ఘటన ప్రధాన న్యాయమూర్తి గవాయ్ చట్టపట్ల, విధి నిర్వహణపై ఉన్న గొప్ప నిబద్ధతను ప్రతిబింబిస్తున్నదని డేవిడ్ రాజు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఆయన అభ్యర్థించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయిపై దాడిని ఖండించిన స్ఫూర్తి గ్రూప్

**ఏ ఎస్ రావు నగర్, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**

చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయిపై సెప్టెంబర్ 7వ తేదీన లాయరు చేసిన బూటు దాడిని తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం కమలానగర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు హాజరై మాట్లాడుతూ "చీఫ్ జస్టిస్ గవాయి అట్టడుగు సామాజిక వర్గానికి చెందినవారు. వివక్షలు, అవమానాలను ఎదుర్కొంటూ రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారా దేశ అత్యున్నత న్యాయపీఠానికి చేరుకున్నారు. దీనిని తట్టుకోలేని మనువాద, సనాతనవాద శక్తులు ఆయనపై నిరంతరం దుష్ప్రచారం చేస్తున్నారు. ఇటీవల ఒక లాయరుచీఫ్ జస్టిస్‌పై బూటు విసిరిన ఘటన హేయమైనది. ఇది ప్రజల్లో మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టే కుట్రలో భాగం మాత్రమే," అన్నారు.

చీఫ్ జస్టిస్ గవాయి తన పదవిని ఎంతో హుందాతనంగా నిర్వర్తిస్తున్నారని, ఇటువంటి దురాగతాలకు ప్రజలందరూ వ్యతిరేకంగా ఏకకంఠంతో స్వరం వినిపించాలని ఆయన పిలుపు నిచ్చారు. దాడికి పాల్పడిన వ్యక్తిని, దానికి తోడ్పడిన శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉదయ భాస్కర్, జి. శివరామకృష్ణ, ఎం. భాస్కర్ రావు, బంగారు నర్సింగ్ రావు తదితరులు ప్రసంగించి చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించారు.కార్యక్రమంలో ఉమా మహేశ్వరరావు, శోభ, గౌస్య, శ్రీనివాస్, మల్లేష్, నర్సింగరావు, భాస్కర్ రావు, చందన్ రాజు, ఉదయ భాస్కర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## హక్కులు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి: ఏసీపీ జగన్

**తార్నాక, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు)**

ఇటీవల ఎన్నికైన నాచారం ఓయూ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులను ఉస్మానియా యూనివర్సిటీ డివిజన్ ఏసీపీ జగన్ అభినందించారు. మంగళవారం ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు రాజు నేతృత్వంలో, అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి కిరణ్ సమక్షంలో క్లబ్ సభ్యులు ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించి, ఏసీపీ జగన్, ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు లను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఏసీపీ జగన్ క్లబ్ సభ్యులను శాలువాతో సత్కరించి మాట్లాడుతూ, "ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియా ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారానికి ప్రభుత్వాన్ని దిశానిర్దేశం చేయాలి" అని అన్నారు. అలాగే ప్రజల్లో హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. "చట్టాలు తెలిసినప్పుడే ప్రజలు ప్రశ్నించగలుగుతారు, ప్రశ్నించినప్పుడే సమాజంలో న్యాయం స్థాపించవచ్చు" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వం గౌడ్, రాజు, పనింద్ర చారి, జాఫర్, విజయ్, తిరుమలరెడ్డి, వెంకట్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## ఓట్ల చోరీపై సంతకాల సేకరణ ముమ్మరం చేయండి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్
- కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 7, తెలంగాణ ముచ్చట్లు:**

ఓట్ల దొంగలు గద్దె దిగండి అనే ఉద్యమం పిలుపు లో భాగంగా ఓట్ల చోరీపై సంతకాల సేకరణకు కాంగ్రెస్ నాయకులు నడుం బిగించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు ఓట్ల చోరీపై సంతకాల సేకరణ చేపట్టాలని కోరారు. బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కుపై ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో అక్రమాలకు కుట్ర పన్నడమే బిజెపి చేసే అతిపెద్ద పని అని ఆరోపించారు. ఎన్నికలను ప్రభావితం చేయడానికి బీహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ చేపట్టారని అన్నారు. ఏడాది కిందట చేపట్టాల్సిన ఈ సవరణ ప్రక్రియ ను ప్రతిపక్షాల ఓట్లను తొలగించాలని ఉద్దేశపూర్వకంగా ఇప్పుడు చేపట్టారని విమర్శించారు ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లి బిజెపి అక్రమాలను ఎండగట్టి ప్రజాభిప్రాయ సేకరణకు సంతకాలు తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలలో ఖమ్మం ప్రత్యేకత ను మరోసారి నిరూపించాలని అన్నారు. అంసెబ్లీ ఎన్నికల్లో పది కి పది సీట్లు ఎలా అయితే సాధించామో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అన్ని పంచాయతీలను కాంగ్రెస్ కే దక్కేలా పని చేయాలని బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేసినారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు టి పి సి సి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహ్మద్ జావేద్, జిల్లా ఓ బి సి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, బోజెడ్ల సతీష్, దగ్గుల రఘుపతి రెడ్డి, చావ వేణు, కందిమల్ల వీరబాబు, వేముల కృష్ణప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డే నారాయణరావు, కళ్ళెం వెంకటరెడ్డి, భూక్యా బాలాజి నాయక్, సూరంశెట్టి కిషోర్, కొమ్మినేని రమేష్ బాబు, గాలి దుర్గారావు, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, శీలం వెంకటనర్సిరెడ్డి, స్వర్ణ నరేంద్ర, తలారి చంద్రప్రకాష్, కాపా సుధాకర్, కాసర చంద్రశేఖర్ రెడ్డి, మిరియాల రమణ గుప్త, ఎదునూరి సీతారాములు తదితర నాయకులు పాల్గొన్నారు.

## దసరా రద్దీతో సత్తుపల్లి ఆర్టీసీకి బంపర్ ఆదాయం

- ₹37 లక్షల 95 వేల 470 రూపాయలు.
- సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత.

**సత్తుపల్లి, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**





దసరా పర్వదినం సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు ఈసారి రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. సోమవారం ఒక్కరోజే రూ.37,95,470 రూపాయల ఆదాయం నమోదు అయినట్లు డిపో మేనేజర్ ఊటుకూరి సునీత తెలిపారు. గతంలో రాఖీ పండుగ రోజున రూ.32 లక్షలు, గత ఏడాది దసరా సందర్భంగా రూ.34 లక్షలు ఆదాయం రాగా, ఈసారి వాటన్నింటినీ అధిగమించి కొత్త రికార్డు సృష్టించామని పేర్కొన్నారు.

పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని 20 అదనపు బస్సు సర్వీసులు నడిపినట్లు తెలిపారు. ఆ రోజు 1.6 శాతం ఆక్రమణ రేటు, 67.80 ప్రయాణికుల కిలోమీటర్ల ఆదాయం సాధించామని వివరించారు. మొత్తం 55,977 కిలోమీటర్ల మేర బస్సులు రాకపోకలు సాగించాయని చెప్పారు.

ఈ విజయానికి డిపో సిబ్బంది కృషే కారణమని, అందరి సమష్టి సహకారంతోనే ఈ రికార్డు సాధ్యమైందని సునీత అభినందించారు. అనంతరం డిపో గేటు వద్ద సిబ్బందితో కలిసి కేక్ కోసి ఆనందోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్ పీ.విజయశ్రీ, ఆర్థిక విభాగ అధికారి ఎస్.సాహితీ, విభాగాధిపతులు, పర్యవేక్షకులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

- టౌన్ ఏసీపీ రమణమూర్తి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;**

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని లేకుంటే చర్యలు తప్పవని టౌన్ ఏసీపీ రమణమూర్తి రౌడీషీటర్లను హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు, చెడు ప్రవర్తన కల్గిన వారిని ఖానాపురం హవెలి పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు.

నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. నేరస్తుల తొందరపాటులో నేరాలు చేసినా.. వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.

రౌడీషీటర్ అనే పదం తమ బిడ్డల భవిష్యత్‌ను ప్రభవితం చేస్తుందని గ్రహించాలని అన్నారు.నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. రౌడీ షీటర్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం



ఉందని చెప్పారు

అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు, దౌర్జన్యాలకు, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు. పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్ట్ నమోదుచేస్తామన్నారు. గతంలో అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలు పంపించడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు.





## సిసి రోడ్లకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్**

**చిల్కానగర్, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. చిల్కానగర్ డివిజన్‌లో ఇందిరానగర్, సీతారామ కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీలలో మొత్తం రూ.1 కోటి 20 లక్షల రూపాయల వ్యయం తో సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ మరియు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సంయుక్తంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "చిల్కానగర్ డివిజన్ అభివృద్ధిలో ముందంజలో ఉంది. కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ప్రజలతో మమేకమై ప్రతి పనిని ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు డివిజన్‌లో 80 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా 20 శాతం పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తాం" అని అన్నారు.కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, "ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి కృషి చేస్తున్నాం. డివిజన్ అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించడంలో సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు" అని తెలిపారు.

కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పలు కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆశావాహుల నుండి దరఖాస్తుల స్వీకరణ

**వేలేరు,అక్టోబర్7(తెలంగాణ ముచ్చట్లు):**

మంగళవారం తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వేలేరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల కోసం పోటీ చేయదలచిన ఆశావాహుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మండల కమిటీ పరిశీలకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పతాకం వేలేరు మండలంలోని ప్రతి గ్రామంలో ఎగరడమే తమ లక్ష్యమని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలని, ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల పరిశీలకులు మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, ఇట్టబోయిన భూపతిరాజు, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మరిజే నరసింహారావు, కాయిత మాధవరెడ్డి, ఎండీ జానీ, గోవింద సురేష్, మారబోయిన రాజు గౌడ్, కోయ్యడ మహేందర్‌తో పాటు గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం-08- అక్టోబర్ 2025








# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై దాడిని ఖండించిన ప్రజా సంఘాలు

**సత్తుపల్లి, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి పట్టణంలో స్థానిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసనలో ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కోలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు సేలం సత్యనారాయణరెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ, దేశంలోనే అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై దాడి ప్రయత్నం చేయడం భారత రాజ్యాంగ న్యాయవ్యవస్థపైనే దాడి చేసినట్టేనని అన్నారు. సనాతన ధర్మం పేరుతో సమాజంలో అరాచకాలు సృష్టించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై షూ విసరడానికి ప్రయత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. భారత న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడేందుకు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు సర్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు, రాము, అర్జున్, సిఐటియు నాయకులు మల్లూరి చంద్రశేఖర్, శరత్, మహిళా సంఘం ప్రతినిధులు సుశీల, రత్నం, పద్మ, మరియమ్మ, సుజాత, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికుల అభివృద్ధికి సమగ్ర చట్టాలు చేయాలి

- **పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలి...**
- **మెరుగు సత్యనారాయణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు. యర్రా శ్రీనివాసరావు రాష్ట్ర కమిటీ సభ్యులు...**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;**




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై కేంద్రీకరించాలి ప్రత్యేక నిధులు కేటాయించి వ్యవసాయ కూలీలకు నిరంతరం పని కల్పించాలి వ్యవసాయ కూలీల అభివృద్ధికి సమగ్ర చట్టాలు చేయాలి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన ఆరు గ్యారెంటీ లను సంపూర్ణంగా అమలు చేయాలి దానిలో భాగంగానే వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12,000 అందిస్తాం అన్న వాగ్దానం అమలు చేయాలని పట్టణ ప్రాంతాలలో ఉపాధి పని కల్పిస్తూ సంవత్సరానికి 150 రోజులు పని కల్పిస్తూ రోజుకి 400 రూపాయలు వేతనం ఇస్తామన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సుందరయ్య భవనాలు వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షులు ఎస్.కె ఇమామ్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ అత్యంత నిరుపేదలైన వ్యవసాయ కూలీలు ఆర్థికంగా విద్యాపరంగా ఆరోగ్యపరంగా వెనకబడి ఉంటున్నారని వ్యవసాయ పనులు సంవత్సరం మొత్తం దొరకకపోగా ఇతర గ్రామీణ పనులు లేకపోవడం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు ప్రభుత్వాలు నిరుపేదలు చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి అనేక గ్రామాలను పట్టణాలలో కలుపుతూ గ్రామీణ ప్రాంతంలో దొరుకుతున్న ఉపాధి పని తీసివేయటం జరుగుతున్నది దీని ఫలితంగా వేలాది మందికి ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతూ కొనుగోలు శక్తి క్షీణిస్తున్నది దీని ఫలితంగా ఆర్థిక సంక్షోభం వస్తున్నది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి కేంద్ర రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని సంవత్సరం పొడుగునా ఉపాధి పనులు కల్పించాలని ఇల్లు లేని నిరుపేదలకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అర్హత కలిగిన వారందరికీ పింఛన్లు రేషన్ కార్డులు మంజూరు చేయాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పింఛన్ల పెంపును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఈనెల 10వ తేదీన ఖమ్మం అర్బన్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని . కోరారు ఇంకా ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కార్యదర్శి పడిగెల నాగేశ్వరరావు గద్దల రత్తమ్మ తీగల వెంకటేశ్వర్లు గద్దల పెంటయ్య ఎస్కే రహీం మొర్రి మేకల ప్రసాద్ వెంకట్ రాములు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.






# ప్రతి ఒక్కరు ఆరోగ్యకర జీవనశైలి పాటించాలి

- **హాజీరా బేగం వనపర్తి ఐసిడిఎస్ సిడిపిఓ**

**పెద్దమందడి,అక్టోబర్7(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల మరియు మోజర్ల గ్రామాల్లో మంగళవారం అంగన్వాడి కేంద్రాల్లో పోషణ్ మాసం - పోషణ్ అభియాన్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి వనపర్తి ఐసిడిఎస్ సి.డి.పి.ఓ హాజీరా బేగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

హాజీరా బేగం మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు ప్రతి అంగన్వాడి కేంద్రంలో పోషణ మహోత్సవాలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యం ప్రతి ఒక్కరు వారి ఆహారపు అలవాట్లలో ఉప్పు, చక్కెర, నూనె వాడకాన్ని తగ్గించుకోవడం మరియు ఆరోగ్యకర జీవనశైలిని పాటించడం అని పేర్కొన్నారు. అయితే, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లల పోషకాహారంపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే ఆహార పదార్థాలను సరైన క్రమంలో వినియోగించడం, బాలమృతంను ఉపయోగించి పిల్లల ఆరోగ్యం మెరుగుపరచడం, పరిశుభ్రత పాటించడం, అలాగే పిల్లల ఎత్తుబరువులను క్రమంగా పరిశీలించడం ముఖ్యమని చెప్పారు.అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రాథమిక విద్యను అందిస్తూ, సమగ్ర అభివృద్ధి సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని హాజీరా బేగం సూచించారు. అలాగే, పిల్లల హాజరు శాతాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, పోషణ్ మాసం కార్యక్రమాలను ప్రతి రోజు డాష్ బోర్డులో అప్లోడ్ చేయాలని కూడా సూచించారు. ఆన్‌లైన్ రిపోర్టులను సమయానుకూలంగా తయారుచేసి శిశు సంక్షేమ విభాగానికి జవాబుదారిత్వం పాటించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి, అంగన్వాడి ఉపాధ్యాయురాలు శారద, చెన్నమ్మ, సువర్ణ, బాలమణి, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి...

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -07, తెలంగాణ ముచ్చట్లు;**




మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మహాకవి వాల్మీకి ఆధ్యాత్మికవేత్తగా రామాయణ కావ్యం రచించి ఆదికవిగా వెలుగొందారని, రామాయణం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని అన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. అనంతరం వక్తలు మహర్షీ వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందుల కారణంగా వ్యక్తి ఆత్మహత్య

**కుషాయిగూడ, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**



రాచకొండ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జై జవాన్ కాలనీ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం సుమారు 1:00 గంటల సమయంలో 30 ఏళ్ల మన్నే నరేందర్ ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు.

మరణించిన నరేంద్ర గతంలో ఏ ఎస్ రావు నగర్‌లోని సీఎంఆర్ ప్రాంతంలో సేల్స్‌మెన్‌గా పనిచేశాడు. తండ్రి మృతి చెందడంతో తల్లితోనే ఉంటున్నాడు. పెళ్లి కాలేదు. పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడించిన వివరాల ప్రకారం, నరేంద్ర స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి డబ్బులు నష్టం చెందినందున ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆత్మహత్య జరిగిన విధానం గురించి వివరాల ప్రకారం, నరేంద్ర ఈసీఐఎల్ ప్రాంతంలోని ఆర్‌స్క్వేర్ ఓ వై ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరు వేసుకొని తన ప్రాణం తీసుకున్నాడు.తల్లి మన్నే జగదాంబ కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం, మృతదేహానికి ప్రాథమిక పరీక్ష (పిఎంఈ) నిర్వహించగా, తరువాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షేత్ర పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసులు మృతుడి ఆర్థిక పరిస్థితులు, స్టాక్ మార్కెట్‌లో నష్టాలు మరియు వ్యక్తిగత సమస్యలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. స్థానిక అధికారులు ఈ ఘటనపై సామాజిక మద్దతు కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.



# ఈసీఐఎల్ డివిసి భద్రతా డిజిటల్ పరిష్కారాలపై అవగాహనా ఒప్పందం

- **భద్రతా వ్యవస్థలు, డిజిటల్ పరిష్కారాలలో అనుభవం పంచుకోవడం ద్వారా సహకారం బలోపేతం**

**ఏ.ఎస్.రావు నగర్, 07 అక్టోబరు (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర పబ్లిక్ సెక్టార్ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) మరియు దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డివిసి) మధ్య భద్రతా వ్యవస్థలు, ఆధునిక డిజిటల్ పరిష్కారాలపై మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్ (ఎంఓయు) 07 అక్టోబరు 2025న కుదుర్చుకుంది.ఈసీఐఎల్ తరపున డా. అనేశ్ కుమార్ శర్మ (ఓ ఎస్, డైరెక్టర్ (టెక్నికల్)) మరియు డివిసి తరపున చైర్మన్ ఎస్. సురేష్ కుమార్, ఐఏఎస్ సంతకాలు చేశారు.ఎంఓయు ను ఈసీఐఎల్ కమాండర్ నీరజ్ ఉదయ్, జనరల్ మేనేజర్ (హెచ్ఎస్ఎస్) మరియు డివిసి, కోల్కత్తా సీనియర్ జనరల్ మేనేజర్ నీరజ్ జైన్ (సి & ఐ) సంతకం చేశారు. ఈసీఐఎల్ నుండి హెడ్ హెచ్ఎస్ఎస్‌పిడి సహా సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. ఎంఓయు ద్వారా ఉభయ సంస్థలు భద్రతా వ్యవస్థల ఆవిష్కరణలు, డిజిటల్ పరిష్కారాలు, ఉత్తమ పద్ధతులు, సామర్థ్య అభివృద్ధి మరియు జ్ఞాన భాగస్వామ్యం ద్వారా సహకారం పెంపొందించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యంగా భద్రతా వ్యవస్థల వ్యూహాత్మక ప్రణాళిక, ప్రక్రియ సులభతరం, గరిష్ట డిజిటలైజేషన్, వ్యాపార సౌలభ్యం మరియు సంబంధిత రంగాల్లో సామర్థ్య వృద్ధి ప్రధాన ఉద్దేశ్యాలు.ఈసీఐఎల్ — ప్రధానంగా అణుశక్తి, రక్షణ, భద్రత మరియు ఇతర జాతీయ ప్రాధాన్యత రంగాలలో సాంకేతిక పరిష్కారాలను అందిస్తూ, వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్ రంగంలో వినియోగదారులకు సేవలందించే కేంద్ర పబ్లిక్ సెక్టార్ సంస్థ.డివిసి — జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ, సామాజికఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో నిమగ్నమై ఉన్న ప్రభుత్వ సంస్థ.




# బెల్ట్ షాప్ నిర్వాహకులను బైండోవర్ చేసిన ఎస్సై సురేష్

**వేలేరు,అక్టోబర్7(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సీపీ ఆదేశాల మేరకు వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నడుస్తున్న బెల్ట్ షాప్‌లపై ఎస్సై సురేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో మంగళవారం నాడు వేలేరు మండల తహసీల్దార్ సమక్షంలో బెల్ట్ షాప్ నిర్వాహకులను బైండోవర్ చేశారు.

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో చట్ట విరుద్ధంగా మద్యం విక్రయిస్తే లేదా నిల్వ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజల్లో శాంతి భద్రతల పరిస్థితి కాపాడే బాధ్యత అందరికీ ఉందని గుర్తుచేశారు. మద్యం విక్రయంపై పూర్తి నిఘా కొనసాగిస్తామని, ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు.

అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తారని, చట్టాన్ని ఉల్లంఘించే వారెవరైనా ఉంటే ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**అక్రమ మద్యం పట్టివేత**

వేలేరు మండలం కన్నారం శివారు ఇచ్చుల్లపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం అక్రమ మద్యం పట్టుబడింది. పట్రోలింగ్ నిర్వహిస్తున్న వేలేరు పోలీసులు అందుకున్న సమాచారం మేరకు మీడిదొడ్డి శ్రీనివాస్ (50), రాజయ్య కుమారుడు, తన కిరాణా దుకాణంలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. స్థలానికి చేరుకున్న పోలీసులు తనిఖీ చేసి రూ.2,940 విలువ గల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కొత్త రిజర్వాయర్ల నిర్మాణం పై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ

**వనపర్తి,అక్టోబర్7(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి నియోజకవర్గంలో కొత్త రిజర్వాయర్ల నిర్మాణం, సాగునీటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెల్లడించారు.మంగళవారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తరువాత, వనపర్తి నియోజకవర్గంలో భవిష్యత్ తరాల సాగునీటి అవసరాల కోసం చేపట్టబోయే రిజర్వాయర్ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు.ముఖ్యంగా గొల్లపల్లి రిజర్వాయర్ మరియు బుద్ధారం స్టేజ్-2 రిజర్వాయర్ నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే, నియోజకవర్గ పరిధిలో భవిష్యత్ తరాలకు కూడా సాగునీటి సమస్యలు పరిష్కరించబడతాయని ఎమ్మెల్యే తెలిపారు.అదేవిధంగా, ఖిల్లా ఘనపురం మండలంలోని ఘనపసముద్రం రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ముందు ఎమ్మెల్యే అభ్యర్థించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, రైతులకు తక్షణమే నష్టపరిహారం మంజూరు చేయనున్నట్లు తెలిపారు.వనపర్తి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడిని ఖండిస్తూ ధర్నా

**కీసర, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు)**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై లాయర్ రాకేష్ కిషోర్ చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మేడ్చల్ జిల్లా కీసర మండలం కేంద్రంలో మంగళవారం ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర ప్రధాన చౌరస్తాలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, జస్టిస్ గవాయి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సుప్రీం కోర్టు వంటి అత్యున్నత న్యాయస్థానంలోనే దేశ ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై, రాజ్యాంగంపై దాడి చేసినట్టే అని వారు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన లాయర్ రాకేష్ కిషోర్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ కీసర పోలీస్ స్టేషన్‌లో రాకేష్ కిషోర్‌పై ఫిర్యాదు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి కట్ట శంకరయ్య, నాగారం పంగ ముత్యాలు, గోధుమకుంట మాజీ ఉప సర్పంచ్ మంచాల రాజలింగం, జలాల్‌పురం మాజీ సర్పంచ్ ఎల్లేష్, బంగారు మైసమ్మ దేవాలయ మాజీ ప్రధాన కార్యదర్శి కుంటోళ్ళ సత్యనారాయణ, తాళ్ల మల్లేష్, శ్రీకాంత్, మాజీ ఉపాధ్యక్షులు బంటు శ్రీనివాస్, కీసరగుట్ట మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు రాగుల రమేష్ ముదిరాజ్, పీపుల్స్ డైరీ రిపోర్టర్ తుడుం బాలకృష్ణ, పండుగ రాజలింగం ముదిరాజ్, మంత్రాల వెంకట్ ముదిరాజ్, కీసర గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఎర్ర సాయిలు, ప్రధాన కార్యదర్శి తుడుం బాలరాజ్, ఉపాధ్యక్షులు ఎంకిర్యాల నర్సింగ్, పట్టా మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్ లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**పెద్దమందడి,అక్టోబర్7(తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామాయణ రచయితగా ప్రసిద్ధి చెందిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని గ్రామ ప్రజలు ఆత్మీయంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా వాల్మీకి సంఘం అధ్యక్షులు మల్లక్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి చూపిన ధార్మిక మార్గం అందరికీ ఆదర్శమని, యువత ఆయన బోధలను అనుసరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్లక్ సురేష్ కుమార్ (వెల్టూర్ బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, వాల్మీకి సంఘం అధ్యక్షులు), శాఖ వెంకటయ్య (మాజీ ఉప మండల పరిషత్ అధ్యక్షుడు), మల్లక్ కృష్ణయ్య (వెల్టూరు సింగిల్ విండో సంస్థ నిర్వాహకుడు), బోయ శ్రీను, మల్లక్ పెద్ద భీమన్న, కావాలి నాగన్న, జింకల కుర్మయ్య, శాఖ కృష్ణయ్య, భసరత, మన్నే ఓ.కొండ, కావాలి అంజి, ముమ్మాల్లా వెంకటయ్య, గురిసే కృష్ణ, కావాలి రాము, కావాలి రామస్వామి, జింకల దశరథ, జల్లి చిన్న కాశాన్న, పెద్ద కాశాన్న తదితరులు పాల్గొన్నారు.



# వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**దమ్మాయిగూడ, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు)**

ఆదికవి రామాయణం రచయిత వాల్మీకి మహర్షి జయంతి మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరుపుకోబడింది. ఈ సందర్భంగా మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన ప్రతిష్టను స్మరించారు. విద్య, సాంస్కృతిక రంగాలలో కొనసాగుతున్న సేవలను కట్టుబట్టుతూ, ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. డి.ఈ.ఈ.ఎస్. బాల మురళి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మరియు ఇతరులు ఈ వేడుకలో పాల్గొని ఘనంగా ఆనందించారు.కార్యక్రమం ద్వారా వాల్మీకి మహర్షి రచనలకు మరియు భారతీయ సాంస్కృతిక వారసత్వానికి గుర్తింపు వహించబడిందని అధికారులు తెలిపారు.

# వాల్మీకి జయంతి చిత్రపటానికి పూలమాల

- **రాచకొండ సిపి జి సుధీర్ బాబు ఘన నివాళులు**

**మల్కాజ్గిరి, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**




ఆదికవి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం రాచకొండ సిపి జి.సుధీర్ బాబు ఐపిఎస్, నేరడ్మేట్ పోలీస్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని వాల్మీకి మహర్షి స్మరణలో ఘన వాతావరణం సృష్టించారు.సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ, "వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి భారత సాహిత్యంలో అమూల్యమైన స్థానం సంపాదించారు. ఆయన రచనలు మనకు సదా ప్రేరణగా ఉంటాయి," అని అన్నారు. ఈ సందర్భంలో వాల్మీకి మహర్షి జీవితానికి సంబంధించిన చిత్రాలు, వృత్తాంతాలు మరియు సాహిత్య విశేషాలను కూడా ప్రదర్శించారు.కార్యక్రమం చివర, సిబ్బంది మరియు పాల్గొన్న వారందరూ వాల్మీకి మహర్షి గుర్తును పూలమాలలతో అలంకరించి ఘన నివాళులు అర్పించారు.




# వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం బాక్స్ డ్రైన్ పనులకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి**

**మల్లాపూర్, అక్టోబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ కాలనీలో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 60 లక్షల రూపాయల వ్యయంతో బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రతి వర్షాకాలంలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరద సమస్య ను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. ఈ బాక్స్ డ్రైన్ పూర్తయ్యాక నీటి నిల్వ సమస్య తీరిపోతుంది" అన్నారు. ప్రజల సౌకర్యం కోసం జిహెచ్ఎంసీ అధికారులు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిఈ రూపా, ఏఈ శ్రవంతి, కాలనీ వాసులు పరమేష్‌రెడ్డి, మధు, రమేష్, ప్రతాప్ రెడ్డి, అశోక్ రెడ్డి, సోమయ్య, సారంగపాని మరియు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# భారత్‌పాక్ మ్యాచ్‌లు ఆపడం సాధ్యమేనా?

- **భారత్-పాక్ మ్యాచ్‌ల రద్దు డిమాండ్‌పై స్పందించిన బీసీసీఐ**
- **ఈ విషయంపై మాట్లాడటం తేలికేనన్న బీసీసీఐ అధికారి**

భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లను నిలిపివేయాలంటూ వస్తున్న డిమాండ్లపై బీసీసీఐ అధికారి ఒకరు స్పందించారు. ఈ విషయంపై మాట్లాడటం తేలికే కానీ, ఆచరణలో ఎన్నో ఆర్థిక సవాళ్లు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్ల ప్రయోజనాలను విస్మరించి నిర్ణయాలు తీసుకోలేమని పరోక్షంగా స్పష్టం చేశారు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బీసీసీఐ అధికారి ఈ విధంగా స్పందించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పరిష్కారమయ్యే వరకు ఐసీసీ టోర్నీలలో భారత్‌పాక్ మ్యాచ్‌లను తగ్గించాలని, ఇందుకోసం పారదర్శకమైన డ్రా పద్ధతిని అనుసరించాలని అథర్టన్ సూచించారు. "క్రికెట్ ఇప్పుడు రాజకీయ ఉద్రిక్తతలకు, ప్రచారానికి వేదికగా మారింది. ఆర్థిక ప్రయోజనాల కోసం టోర్నీల షెడ్యూల్ మార్చడాన్ని సమర్థించలేం" అని ఆయన తన కాలమ్‌లో పేర్కొన్నారు. అథర్టన్ సూచనపై స్పందిస్తూ, పేరు చెప్పడానికి ఇష్టపడని ఆ బీసీసీఐ అధికారి ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. "ఇలాంటి విషయాల గురించి మాట్లాడటం చాలా సులభం. కానీ స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్లు దీనికి అంగీకరిస్తారా? కేవలం భారత్ అనే కాదు, ఏ పెద్ద జట్టు టోర్నీ నుంచి తప్పుకున్నా స్పాన్సర్లను ఆకర్షించడం కష్టమవుతుంది" అని ఆయన వాస్తవ పరిస్థితిని వివరించారు. గత నెల 28న ముగిసిన ఆసియా కప్ ఫైనల్ తర్వాత ఈ వివాదం పెద్దదైంది. పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిగా ఉన్న ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించడానికి భారత జట్టు నిరాకరించింది. పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు సంఘీభావంగా పాక్ ఆటగాళ్లతో కరచాలనం చేయడానికి కూడా టీమిండియా ఇష్టపడలేదు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ జట్లు కేవలం ఐసీసీ టోర్నీలు, ఆసియా కప్ వంటి ఈవెంట్లలో మాత్రమే తలపడుతున్నాయి. 2013 తర్వాత ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరగలేదన్న విషయం తెలిసిందే.

# మృతుడి భౌతికకాయానికి నివాళులు అర్పించిన సద్దాం హుస్సేన్

**వేలేరు,అక్టోబర్7(తెలంగాణ ముచ్చట్లు):**



వేలేరు గ్రామానికి చెందిన జూల రాజు మరణించిగా విషయం తెలిసుకున్న కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు,మాజీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ జూల రాజు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాల కోసం కొంత ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అక్కల శంకర్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అక్కల ప్రశాంత్, యువజన నాయకులు కురుసపెల్లి అజయ్, శివప్రసాద్, సలీం మాలిక్, రఫీ, ఆరిఫ్, గ్రామ పెద్దలు, కుల సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


# మృతుల కుటుంబాలకు విజయ్ వీడియో కాల్

- **త్వరలో వారిని ప్రత్యక్షంగా కలుస్తానని హామీ**
- **బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తానని చెప్పిన టీవీకే చీఫ్**

తమిళనాడులోని కరూర్ లో టీవీకే చీఫ్ విజయ్ ర్యాలీలో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. గత నెల 27న జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా మరో 60 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన విజయ్.. దుర్ఘటన వెనక కుట్ర కోణం ఉందని ఆరోపించారు. స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని టీవీకే తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలను విజయ్ పరామర్శించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే విజయ్ తాజాగా స్పందించారు. మృతుల కుటుంబాలతో ఆయన వీడియో కాల్ లో మాట్లాడారు. ఈరోజు ఉదయం బాధిత కుటుంబాలకు విజయ్ ఫోన్ చేశారు. ఆత్మీయులను కోల్పోయి దుఃఖంలో ఉన్న వారిని ఓదార్చారు. త్వరలోనే వచ్చి వారిని కలుస్తానని హామీ ఇచ్చారు. పార్టీ తరపున, వ్యక్తిగతంగా కూడా వారికి అండగా ఉంటానని విజయ్ పేర్కొన్నారు. తొక్కిసలాటలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని త్వరలోనే పరామర్శిస్తానని విజయ్ చెప్పారు. కాగా, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ టీవీకే పార్టీ తరపున విజయ్ రూ.20 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే.

# హైవేపై కూలిన మెడికల్ హెలికాప్టర్

- **హైవే 50పై ఓ కారు మీద తలకిందులుగా పడ్డ వైనం**
- **ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు**
- **ఘటనతో హైవేపై పూర్తిగా నిలిచిపోయిన రాకపోకలు**
- **ప్రమాద కారణాలపై అధికారుల దర్యాప్తు ప్రారంభం**




అమెరికాలో సోమవారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోగులను అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించే ఓ మెడికల్ హెలికాప్టర్ (ఎయిర్ అంబులెన్స్) రద్దీగా ఉండే హైవేపై కుప్పకూలింది. ఈస్ట్ శాక్రమెంటోలోని హైవే 50పై ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్ నేరుగా ఓ వాహనంపై తలకిందులుగా పడిపోవడంతో, ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు శాక్రమెంటో అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. 'రీచ్ ఎయిర్ మెడికల్ సర్వీసెస్'కు చెందిన ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్ యూసీ డేవిస్ మెడికల్ సెంటర్ పైనుంచి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే అత్యవసర సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంతో హైవే 50పై తూర్పు వైపు వెళ్లే మార్గాన్ని పూర్తిగా మూసివేసి, ట్రాఫిక్‌ను మళ్లించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన చిత్రాల్లో ఎరుపు రంగు హెలికాప్టర్ హైవే మధ్యలో కారుపై తలకిందులుగా పడి ఉన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో హెలికాప్టర్ ఆసుపత్రికి వెళుతోందా? లేక రోగిని తీసుకుని వస్తోందా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, అధికారులు దర్యాప్తు ప్రారంభించారని సంబంధిత వర్గాలు వెల్లడిరచాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రచయితలు ప్రజలకు పనిచేయడం వారి సామాజిక బాధ్యత



నడుస్తున్న చరిత్రను వ్యంగ్యంగా మలిచి ప్రజా గొంతుకగా పనిచేసిన రచయితలు,సామాజికవేత్తలు, చరిత్రకారులు, కార్టూనిస్టులు, మేధావులు, విశ్లేషకులు, ఉపాధ్యాయులు, సంఘ సేవకులు ప్రజల మేలు కోసం సామాజిక మనుగడ కోసం మరింత ఉత్తమమైన సమాజం కోసం అంతిమంగా సమసమాజ స్థాపన కోసం పనిచేస్తారు అనడంలో సందేహం లేదు. ఒకవేళ ఆయా రంగాలకు చెందిన వాళ్లు తమ సామాజిక బాధ్యతను విస్మరించినట్లయితే వ్యవస్థకు తన పదవికి అంతిమంగా మానవ జన్మకి ద్రోహం చేసినట్లుగా భావించవలసి ఉంటుంది. ఎందుకంటే స్వార్థ స్వప్రయోజనం, గుండాయిజం, రౌడీయిజం, రాక్షస రాజ్యం,అత్యాచారాల పర్వం, దోపిడీ పీడన, వంచన, ఆధిపత్యం ,అహంభావం వంటి అనేక అవలక్షణాల కారణంగా సమాజం ఇప్పటికీ చాలా భ్రష్టు పట్టిపోయింది. ఈ సమాజాన్ని బాగు చేయడానికి రచయితలు కవులు మేధావులు విశ్లేషకులు సామాజిక కార్యకర్తలు కూడా ఎవరి దారిన వాళ్ళు కష్టపడి పనిచేస్తున్నారు. వ్యవస్థ బాగు కోసం ఉమ్మడిగా కూడా ఆరాటపడుతున్నారు. ఆ ఆరాటం లేకుండా కేవలం నటనతో జీవించేవాళ్లు ఈ దేశానికి ద్రోహం తలపెట్టే వాళ్ళు. "అదే సందర్భంలో పాలకులు కూడా ప్రజల కంటే మిన్నగా తమ స్వప్రయోజనాలను, అధికార దాహాన్ని, వర్గ ప్రయోజనాన్ని, అధికారాన్ని శాశ్వతం చేసుకునే క్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఆ కారణంగా కూడా రాజకీయ సామాజిక చారిత్రక రంగాలలో ఏర్పడుతున్నటువంటి లోపాన్ని సవరించడం కూడా మేధావులకు బుద్ధి జీవులకు అదనపు బాధ్యతగా మారిపోతున్నది. "ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా నిజము మరిచి నిద్రపోకుమా'' అని ఒక వైపు ప్రముఖ విప్లవ రచయిత శ్రీ శ్రీ ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తే ఆ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలను నిరంతరం జాగరూ కులను చేయడానికి ప్రభావితం చేయడానికి మేధావులు, రచయితలు, విప్లవ రచయితలు, సంఘ సంస్కర్తలు, సామాజిక కార్యకర్తలు తమ భుజానికి వేసుకొని బాధ్యతను మరింతగా మోస్తున్న విషయాన్ని మనం గమనించాలి. అదే కోవలోకి కార్టూనిస్టులు రచయితలు కూడా వస్తారు అని తెలుసుకోవాలి.

ప్రముఖ కార్టూనిస్టు విశ్లేషకుడు నడుస్తున్న చరిత్రను నిరంతరం గతి తప్పకుండా సంస్కరించడానికి తన జీవితమంతా తోడ్పడినటువంటి కార్టూనిస్టు ఆర్కే లక్ష్మణ్ –జకీయ నాయకులకు నేనెంతో రుణపడి ఉన్నాను. వాళ్లు దేశాన్ని పట్టించుకోకపోయినా నన్ను పట్టించుకున్నారు నా కార్టూన్లకు కావలసిన సరుకు ఇచ్చి ప్రజల మధ్యన నేను జీవించడానికి తోడ్పడ్డారు. రాజకీయ నాయకులు గనుక మంచి వాళ్ళు అయితే నీతి నియమావళితో కట్టుబడి ఉండి సుపరిపాలన గనక చేస్తే నా ఉద్యోగం ఊ్ం డిపోయేది ఉద్యోగం మానేయవలసి వచ్చేది'''' అని తాను నిర్వహించిన పాత్రను వ్యంగ్యంగా చెప్పడాన్ని గమనించినప్పుడు కార్టూనిస్ట్ ఆర్కే లక్ష్మణ్ గారు నిర్వహించిన సామాజిక బాధ్యత ఎంత గొప్పదో మనకు అర్థమవుతుంది. సమకాలీన సామాజిక రాజకీయ ఆర్థిక చారిత్రక పరిస్థితుల పైన అవగాహనతో వాటిని ప్రభావితం చేయడం ద్వారా సుపరిపాలన అందించవలసినటువంటి ప్రభుత్వాలు ప్రజాస్వామిక దేశంలో ఆ వైపు కన్నెత్తి కూడా చూడకుండా పెట్టుబడి దారి సామ్రాజ్య విధానాలకు తొత్తులుగా వ్యవహరించి సామాన్యుడిని బలి పశువులను చేశాయని అందుకే సామాన్యుని పక్షాన తన జీవితమంతా పనిచేయడానికి టైమ్స్ ఆఫ్ ఇండియాలో 50 సంవత్సరాల తో పాటు ఇతర పత్రికలలో అనేక సంవత్సరాల పాటు కార్టూనిస్ట్ గా పనిచేసి సామాజిక అంశాలను ఎత్తిచూపి రాజకీయ పార్టీల నాయకులకు కనువిప్పు కలిగించిన దార్శనికు నిగా మనం ఆర్కే లక్ష్మణ్ గారిని గుర్తించవలసిన అవసరం ఉంది. '''' "రాజు చేతి కత్తిరక్తంబు వర్షించు సుక వి చేతి కలము సుధలు కురియు, అతడేల గల్గు యావత్ ప్రపంచంబు ఈతడేలగలుగు ఇహము పరము'' అని జాషువా గారు అన్నట్లు ఒక రచయిత ఒక మేధావి ఒక ప్రజా కోణంలో ఆలోచించగలిగినటువంటి నిపుణుడు పదునైన కలము ద్వారా కత్తి కంటి మిన్న అయినటువంటి సామాజిక మార్పును సాధించగలరని చెప్పడానికి జాషువా గారు వర్ణించిన ప్రకారంగా ప్రజా క్షేత్రంలో పనిచేసిన వారిగా ఆర్కే లక్ష్మణ్ కామన్ మ్యాన్ ను దృష్టిలో ఉంచుకొని చేసిన వారి రచనలు ప్రధాన పాత్ర పోషిస్తుంటే, ప్రభుత్వాల యొక్క వైఫల్యాన్ని ఎత్తిచూపడంలో క్రియాశీలక పాత్ర పోషించడాన్ని మనమందరం అభినందించాలి .కేవలం రచనతోనే వదిలిపెట్టకుండా సామాన్యుల గొంతుకగా వారి సమస్యల పరిష్కారంలో తన బాధ్యతగా స్వీకరించి పాలకులకు దడ పుట్టించినటువంటి కార్టూనిస్టుగా, ప్రజాప్రతినిధిగా వారు భారత దేశంలో సుపరిచితుడు. ఆర్కే లక్ష్మణ్ గారి లాగా ప్రతి వ్యక్తి తనకంటూ ఒక రంగాన్ని నిర్మాణం చేసుకొని సామాజిక బాధ్యతను నిర్వహించడం ద్వారా ఎంతో కొంత మార్పు కోసం కృషి చేయడానికి సిద్ధపడాలి. ఆ రకంగా కాకుండా తన వరకు మాత్రమే పరిమితమైనటువంటి వ్యక్తుల గురించి ఈ వ్యవస్థ పట్టించుకోదు వాళ్ల అవసరం ఈ వ్యవస్థకు కూడా లేదు అని కఠినంగా చెప్పగలిగితే కనువిప్పు కలిగేలా మాట్లాడగలిగితేనే భవిష్యత్తులో లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రజలను జాగ్రత్తపరచడానికి తద్వారా మెరుగైనటువంటి సమాజాన్ని, పాలకులను సా కారం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అంబేద్కర్ గారు అన్నట్లు'' ''''సమాజ హితం కోరనటువంటి పాలకులు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. ప్రజలు తమ కిష్టమైనటువంటి పాలనను తెచ్చుకునే క్రమంలోపల ఉన్న వ్యవస్థను చిదిమి వేస్తారు. ''''అని చేసిన హెచ్చరిక ఇప్పటికీ ప్రభుత్వాలకు గుణపాఠం అయితే మంచిదే.



## టిమ్ కుక్ తర్వాత ఎవరు? యాపిల్ సీఈవో గురించి జోరుగా చర్చ

ప్రముఖ టెక్ కంపెనీ యాపిల్‌కు తదుపరి సీఈవో ఎవరు? టిమ్ కుక్ వారుసడిగా ఎవరు రానున్నారు? ఈ అంశం గత కొంతకాలంగా టెక్ సర్కిళ్లలో చర్చ జరుగుతూనే ఉంది. ప్రస్తుత సీఈవో టిమ్ కుక్ వచ్చే నెలలో 65 ఏళ్లు పూర్తి చేసుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వారసుడి అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఈ క్రమంలోనే యాపిల్‌లో హార్‌డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగం బాధ్యతలు చూస్తున్న వైస్ ప్రెసిడెంట్ జాన్ టర్నస్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. యాపిల్‌తో టర్నస్‌కు 24 ఏళ్లుగా అనుబంధం ఉంది. ప్రస్తుతం ఆయన వయసు 50 ఏళ్లు. (2011లో సీఈవోగా బాధ్యతలు చేపట్టినప్పుడు టిమ్ కుక్ వయసు కూడా 50 సంవత్సరాలే.) కేవలం హార్‌డ్‌వేర్ బాధ్యతలే కాదు.. యాపిల్ సంస్థలో కీలక నిర్ణయాల్లో తీసుకునే అతికొద్దిమంది వ్యక్తుల్లో టర్నస్ ఒకరు. ఇటీవల లండన్‌లో ఐఫోన్ 17 ఈవెంట్‌లో ఐఫోన్ ఎయిర్‌ను ఆయనే పరిచయం చేశారు. ప్రస్తుతం యాపిల్‌లో ఉన్న సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను పరిగణనలోకి తీసుకుంటే చాలా చిన్నవారున్నారు.. లేదంటే రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నవారు ఉన్నారు. టర్నస్ మధ్య వయస్కుడు కావడం కలిసొచ్చే అంశం. కంపెనీలోని ఇతర వ్యక్తులతో పాటు టిమ్ కుక్ దగ్గరా టర్నస్‌కు మంచి పేరుంది. అత్యవసర పరిస్థితులు తలెత్తితే యాపిల్ సీవోవోగా ఉన్న సబిహ్ ఖాన్ లేదా రిటైల్ హెడ్ డీర్డ్రే ఓబ్రియిన్ తాత్కాలికంగా సీఈవో బాధ్యతలు చేపట్టొచ్చు. ప్రణాళిక ప్రకారమే ముందుకెళితే టర్నస్‌కే అవకాశాలు మెండుగా ఉన్నాయని టెక్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే సీఈవో బాధ్యతల నుంచి వైదొలిగే అంశంపై ఇప్పటివరకు టిమ్ కుక్ తన మనసులో మాట బయటపెట్టలేదు. ఒకవేళ కొత్త సీఈవో వస్తే ఈ పోటీ ప్రపంచంలో యాపిల్‌ను అంతే సమర్థంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బృహత్తర బాధ్యత అతనిపై ఉంటుంది.

## యూపీఐ పిన్ అక్కర్లేదిక.. ఫేస్, ఫింగర్‌ప్రింట్‌తోనే పేమెంట్స్!

డిజిటల్ చెల్లింపుల స్వరూపాన్నే మార్చేసిన యూపీఐలో కీలక మార్పు రాబోతోంది. పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే చెల్లింపులు చేయగలిగే కొత్త వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఫేస్ రికగ్నిషన్, ఫింగర్ ప్రింట్ సాయంతో లావాదేవీలు చేసే సదుపాయానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అక్టోబర్ 8న శ్రీకారం చుట్టనుందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ 'రాయిటర్స్' కథనం వెలువరించింది. ముంబయిలో జరుగుతున్న ఫిన్‌టెక్ ఫెస్టివల్ వేదికగా దీన్ని ఆవిష్కరించనుందని తెలిపింది. యూపీఐ చెల్లింపులకు పిన్‌తో పాటు ప్రత్యామ్నాయ విధానాలు కూడా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించింది. ప్రస్తుతం ఎంటర్ చేస్తున్న 4/6 అంకెల పిన్ స్థానంలో ఇతర ఆప్షన్లు కూడా ఉండాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో బయోమెట్రిక్ వివరాలతో పేమెంట్స్ చేసే సదుపాయం తీసుకురావంపై ఎన్‌పీసీఐ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉడాయ్ డేటాబేస్‌లో ఉన్న ఆధార్ బయోమెట్రిక్ వివరాలను చెల్లింపుల కోసం వినియోగించుకోనుంది. దీనిపై ఎన్‌పీసీఐ ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఒకవేళ బయోమెట్రిక్ చెల్లింపుల వ్యవస్థ అందుబాటులోకి వస్తే పిన్‌కు ప్రత్యామ్నాయంగా మారడంతో పాటు డిజిటల్ పేమెంట్స్‌లో గణనీయమైన మార్పులు రానున్నాయి.

# హత్యలు, అత్యాచారాలు చేసిన వాళ్లకు శిక్షలు పడడం లేదు

మత విశ్వాసాల కోసం ఆధారాలు లేకుండా కాల్చి కూల్చడం ప్రజాభిప్రాయాలను అణచి వేయడమే అక్కడేదో పెద్ద జన సందోహం మధ్యన కాల్పుల మోత వినబడిరది. ఏమైనా ప్రమాదమా లేక ఎన్కౌంటర్ రా లేక మరేదైనా జరిగిందా? అనేది ప్రజల ఆందోళన... అయితే అదేది లేదు చట్టబద్ధంగా ప్రభుత్వ పర్యవేక్షణలో, ప్రభుత్వ ఆమోదంతో, పోలీసుల రక్షణల మధ్యన, నమ్మిన కొంతమంది ప్రజల బలగాల సాక్షిగా అక్కడ జరిగింది నిజంగా మారన హోమమే. మనిషిని బలి తీసుకోవడమే. మానవ రూపంలో ఉన్న బొమ్మ ను కాల్చి చంపడమే! అయితే ఆ వ్యక్తి చరిత్రలో నిలబడకపోయినా పౌరాణిక గాథలో గొప్ప రారాజుగా వెలుగొందిన వాడు అదే కాలంలో అయోధ్య నగరానికి అంతిమంగా శ్రీరాముడు పరిపాలించిన కాలంలో వీరి మధ్యన జరిగిన యుద్ధం, సీతాపహరణం, సీతను ఎత్తుకు వచ్చినాడనే ఆరోపణ రావణుని పైన పె ను దుమారం రగిలించిన వేళ సీతను ఏమాత్రం కూడా ముట్టక కనీసం బాధించక తన చెల్లె ముక్కు చెవులు కోసినందుకు శ్రీరాముని భార్యను లక్ష్యంగా చేసుకొని బంధించినట్లు మాత్రమే చెప్పబడిరదిచరిత్రలో పౌరాణిక గాథలో. చరిత్ర వేరు విశ్వాసాలు వేరు ఆధ్యాత్మిక భావనతో పౌరాణిక ఇతిహాసాలు వేరు వీటికి కొన్ని ఆధారాలు ఉండవచ్చు లేదా ఆధారాలను కల్పించి చట్టబద్ధం చేసే పని కూడా కొనసాగింది. చివరికి ఇదంతా విశ్వాసాల మీద ఆధారపడినటువంటి వ్యవస్థగా తీర్చిదిద్దబడినప్పటికీ మంచికి ప్రతినిధిగా రామున్ని, చెడుకు ప్రతినిధిగా రావణుని నిర్ధారించడమే ఇక్కడ వివాదానికి కారణమైంది. అయితే వాళ్ల వాళ్ల యొక్క నేరాలు తప్పిదాల కారణంగా జరిగిన యుద్ధంలో ఓటమి పాలు కావడం చనిపోవడం అనే అంశాలు చారిత్రకంగా కొద్దిసేపు ఆలోచిస్తే ఆ కథకు ముగింపు పలకాల్సిందే. కానీ నేటి యుగంలో కూడా ఆ రావణుని దిష్టి బొమ్మను దహనం చేయడం, బాంబులతో పేల్చడం, అక్కసు వెళ్ల తీసుకొని కొన్ని వర్గాలు రాముని పక్షాన వకాలత పుచ్చుకున్నట్టుగా వ్యవహ రించడం అనేది కొంత ఆందోళన కలిగించే విషయం. రావణుడు లేడు రాముడు లేడు రావణుని బొమ్మను కాల్చితే ఎవరికీ ఏమీ బాధ లేదు కానీ మనో భావాలు దెబ్బ తినే పరిస్థితి ఉన్నప్పుడు మాత్రం ఖచ్చితంగా ప్రశ్నించే అవకాశం ఉంటుంది కనుక మనోభావాలకు భిన్నంగా ఎవరు నడిచినా అది శిక్షార్హమే అవుతుంది. రావణుడు సీతను అపహరించినాడనే కారణంతో లంక పైన యుద్ధం చేసి సంహరించడం ఒక ఎత్తు అయితే రావణాసురుని సోదరి సూర్పనక చెవులు కోసినందుకు లక్ష్మణునికి మరి ఏ శిక్ష వేయాలి? అని ప్రశ్నించే వాళ్ళు కూడా లేకపోలేదు. ఈ రకంగా ఆత్మాభిమానం దెబ్బతిన్న కారణంగానే తన సహోదరి ఆత్మ రక్షణ కోసం ఆత్మాభిమానంతో మాత్రమే సీతను అపరిచినట్లు కొంతమంది పౌరాణిక ఇతిహాసాల పైన ఆలోచించే వాళ్ళ యొక్క అభిప్రాయం. శాస్త్రీయ యుగంలో అను పరిజ్ఞానంతో విశ్వాంతరాల మదించగలుగుతున్నటువంటి ఈ కాలంలో వేల సంవత్సరాలకు పూర్వం జరిగినట్లుగా చెప్పబడుతున్నటువంటి రామాయణ ఇతిహాసం చారిత్రక ఘట్టం. అది ఊహాజనితంగానే మిగిలిపోవడం విచారకరమైతే అందులో కూడా మనిషిని సాటి మనిషిగా చూడకుండా వివక్షతకు గురి చేయడం,చెడును ఆపాదించి నేరాన్ని మోపి భారీ శిక్షవేయడం ఒకరకంగా మెజార్టీ ప్రజల ఆత్మ అభిమానాన్ని దెబ్బతీయటమే. ఇటీవల కాలంలో గనక గమనించినప్పుడు అనేక పెద్దపెద్ద నేరాలు హత్యలు, అత్యాచారాలు చేసినటువంటి వాళ్లకు కూడా పదుల సంవత్సరాల పాటు న్యాయ విచారణ



పేరుతో కాలయాపన జరుగుతున్నదే కానీ శిక్షలు పడడం లేదు. అందులో కూడా డబ్బున్నటువంటి వాళ్లకు రాజకీయ నాయకులకు ఎన్నో మినహాయింపులు ఉన్నాయి ఇదంతా ఈనాడు రాజకీయ రణక్షేత్రంలో జరుగుతున్న రచ్చ మనందరికీ తెలిసినదే. "నేటి యువత ఈనాడు జరుగుతున్నటువంటి అన్యాయాలు అవినీతి, అక్రమాలు, దోపిడి పీడ న, అనుచనేత,వివక్షతలపైన పోరాటం చేయవలసినది పోయి చరిత్రకు అందని చారిత్రక ఆనవాళ్లు లేని ఒక విశ్వాసాన్ని బలంగా పట్టుకొని వ్యక్తిని బొమ్మగా చేసి బాంబులు పెట్టి కాల్చి అక్కసు వెళ్ళ తీసుకుంటున్నారు అంటే క్రూరత్వం నేటి మనిషిలో దాగి ఉన్నట్లే కదా!'' అలాంటప్పుడు నేటి సమాజంలో ప్రశాంతత ఏ రకంగా సాధ్యమవుతుంది? ''''ఇప్పటికీ నేటి సమాజంలో మద్యము, మత్తుపదార్థాలు, ధూమపానము, క్లబ్బులు, పబ్బులు, ఈవెంట్లు, రకరకాల దోపిడీ పద్ధతులకు యువత పాల్పడడం ద్వారా చారిత్రక సామాజిక శాస్త్రీయ రాజకీయ పరిజ్ఞానానికి దూరంగా లక్షలాదిమంది యువత నెట్టివేయబడుతున్నారు. అంద విశ్వాసాల పునాదిపైన తమ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు ఈ విశ్వాసాలకు తల్లిదండ్రులు సహకరించడం కానీ లేక తమ పిల్లలను కట్టడి చేయడం కానీ లేని కారణంగా అబూత కల్పనలు వాస్తవాలై, వాస్తవాలు అబూత కల్పనగా మారిపోతూ అనవసరంగా ఈ సమాజాన్ని రెండుగా చీల్చి వేయడం జరుగుతున్నది ఇది అమానవీయమైనటువంటి దురాలోచన. '''''' ఈ దురాలోచనకు వెంటనే స్వస్తిపలకాల్సినటువంటి అవసరం కూడా ఉన్నది. ఈ అంశం పైన చాలా చోట్ల బాంబులతో కాల్చడం అనేది చట్ట విరుద్ధమని పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసినప్పటికీ, అక్కడక్కడ న్యాయవ్యవస్థ దృష్టికి తీసుకుపోయే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసినప్పటికీ, ప్రభుత్వ పెద్దలకు ఇది సరైనది కాదని సమాచారం ఇచ్చినప్పటికీ ఈ కార్యక్రమాలలో మంత్రులు అధికారులు, శాసనసభ్యులు ఇతర ప్రజా నాయకులు పాల్గొనడం కూడా కొంత ఆక్షేపనియం కాదా !

తోటి మనిషిని సాటి మనిషిగా గౌరవించవలసినటువంటి ఈ మానవీయ సమాజంలో అమానవీయ సంఘటనలకు స్థానం లేదు. చరిత్ర కందని అంశాల పైన పెద్దగా పట్టింపుతో ప్రజలను నిలువునా చీల్చే ఇలాంటి దుందుడుకు కార్యక్రమాలను ప్రభుత్వం కట్టడి చేయాలి ఉక్కు పాదం మోపాల్సిన అవసరం కూడా చట్టం పైన ఉన్నది. ఇలాగే కొనసాగినట్లయితే రావణుని కాల్చినట్లుగా రాముని విగ్రహాన్ని కూడా తయారుచేసి ఇదే మాదిరిగా మరికొంత మంది కాల్చడానికి కూల్చడానికి గనక ప్రయత్నం చేస్తే ఇంకా ఏమైనా ఉంటుందా? ఇది మారణ హోమానికి దారి తీయదా? ఈ అమానవీయ సంఘటనలకు ఆజ్యం కోసే బదులు ఎక్కడో ఒకచోట నిలువరించవలసిన అవసరం ఉన్నది. పోలీసులు, అధికారులు,న్యాయ వ్యవస్థ, ప్రభుత్వము ఈ దురాలోచన పైన ఊహాజనిత విశ్వాసాల పైన ఉక్కు పాదం మోపాల్సినటువంటి అవసరం ఎంతగానో ఉన్నది. లేకుంటే రాబోయే కాలంలో ఆందోళనకరమైన పరిస్థితులు తలెత్తితే ప్రభుత్వాలే బాధ్యత వహించవలసి ఉంటుంది కదా! అది సమంజసమా? అవసరమా? అని న్యాయ ని పు నులు మేధావులు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దయచేసి ఈ రుగ్మతను ఇంతటితో ఆపడం వల్ల 140 కోట్లు గా ఉన్నటువంటి భారతీయులమైన మనమంతా ఐక్యంగా కలిసి ఉండడానికి, అభివృద్ధి పథంలో ఈ దేశాన్ని పయనింపచేయడానికి, సర్వశక్తులు ధారబోయడానికి, శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆరాధించడం ద్వారా ప్రపంచంలోనే భారతదేశం ఉన్నతమైన దేశంగా వి లసిల్లడానికి అవకాశం ఉంటుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఉస్తాద్ వచ్చేది అప్పుడేనా?



'ఓజీ'తో ఘనవిజయాన్ని అందుకున్న పవన్‌కల్యాణ్.. అదే జోష్‌లో తన నెక్ట్స్ సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'ని కూడా పూర్తి చేసేశారు. రీసెంట్‌గా ఆ సినిమాకు సంబంధించిన పవన్ పార్ట్ కంప్లీట్ అయ్యింది. ఇక డబ్బింగ్ చెప్పడమే తరువాయి. మరోవైపు దర్శకుడు హరీశ్‌శంకర్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని కూడా శరవేగంగా కనిచ్చేస్తున్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్'ని వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే విడుదల తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ని ఇప్పటికే షురూ చేశారు. విడుదల తేదీ ప్రకటించగానే ప్రమోషన్స్‌ని వేగవంతం చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. శ్రీలీల, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: అయనంకా బోస్, సంగీతం: దేవిశ్రీప్రసాద్,

# మళ్లీ మొదటికొచ్చిన చర్చ!



దశాబ్దాల తర్వాత ఒకే తెరపై కనిపించనున్న సూపర్‌స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ సినిమాపై ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ భారీ మల్టీస్టారర్‌కు యువ దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ దర్శకత్వం వహిస్తారంటూ వచ్చిన వార్తలకు ఆయన స్వయంగా తెరదించారు. దీంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఎవరు దర్శకత్వం వహిస్తారనే దానిపై మళ్లీ ఉత్కంఠ నెలకొంది. కోలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ భారీ మల్టీస్టారర్‌కు దర్శకుడిగా తొలుత లోకేశ్ కనగరాజ్ పేరు వినిపించింది. అయితే ఇటీవల యువ నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ పేరు తెరపైకి వచ్చింది. ఈ ప్రచారంపై ఆయన ఇటీవల స్పష్టత ఇచ్చారు. తన సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈ విషయంపై మాట్లాడిన ప్రదీప్, ఆ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. "ప్రస్తుతం నేను దర్శకత్వంపై దృష్టి పెట్టడం లేదు. నా పూర్తి ఫోకస్ నటనపైనే ఉంది. ఆ ప్రాజెక్ట్ గురించి ఎక్కువగా మాట్లాడలేను" అని ఆయన తేల్చిచెప్పారు. అయితే, ఒకవేళ మిమ్మల్ని ఆ ప్రాజెక్ట్ కోసం సంప్రదిస్తే ఏం చేస్తారని ప్రశ్నించగా, ఆయన మౌనంగా ఉండిపోయారు. ప్రదీప్ రంగనాథన్ క్లారిటీతో ఈ ప్రాజెక్టుకు దర్శకుడు ఎవరనే దానిపై మళ్లీ సస్పెన్స్ నెలకొంది. ఆయన ప్రకటనతో చిత్రబృందం మరో దర్శకుడి కోసం అన్వేషణ మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' వంటి విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు కమల్ హాసన్ మాత్రం 'థగ్ లైఫ్' వంటి చిత్రంతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో ఈ మల్టీస్టారర్ ఇద్దరి కెరీర్‌కు కీలకం కానుండగా, ఇంతటి భారీ ప్రాజెక్టుకు ఎవరు దర్శకత్వం వహిస్తారోనని కోలీవుడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి



# ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయిన జాన్వీకపూర్

హిందీ,తెలుగుతోపాటు ఇండియా వైడ్‌గా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది
బాలీవుడ్ భామ జాన్వీకపూర్. దేవర సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చిన ఈ భామ ఇటీవలే మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. జాన్వీకపూర్ నటించిన తాజా చిత్రం ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌తో మొదలై.. నెగెటివ్ రివ్యూస్ తెచ్చుకుంది. అక్టోబర్ 2న విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. ఇప్పటివరకు కేవలం రూ.30 కోట్లు మాత్రమే రాబట్టింది. శషాంక్ ఖైతాన్ డైరెక్ట్ చేసిన ఈ మూవీని బాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ ధర్మ ప్రొడక్షన్స్ నిర్మించింది. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో వరుణ్ ధవన్ హీరోగా నటించాడు. హిందీలో చాలా కాలంగా మంచి కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న జాన్వీకపూర్‌కు ఈ సినిమా తీవ్ర నిరాశనే మిగిల్చిందని తాజా ఫిగర్స్ చెబుతున్నాయి.
ఇక జాన్వీకపూర్ తెలుగులో నటిస్తోన్న రెండో ప్రాజెక్ట్ పెద్దిపైనే తన ఆశలన్నీ పెట్టుకుంది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు సాన డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. స్పోర్ట్స్ డ్రామా బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు



# డిఫరెంట్ ఫొటోషూట్లతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తుంది...మృణాల్ ఠాకూర్

బాలీవుడ్ ముద్దుగుమ్మ.. టాలీవుడ్ హార్ట్‌త్రోబ్ మృణాల్ ఠాకూర్ తన హట్‌నెస్‌తో మరోమారు రెచ్చిపోయింది. ఇప్పటికే తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ ముద్దుగమ్మ.. అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉంది. సమయం దొరికితే కమర్షియల్ యడ్స్ చూస్తూ రెండు చేతులా ఆర్జిస్తుంది. సామాజిక మాధ్యమాల్లోనూ యాక్టివ్‌గా ఉంటే ఈ చిన్నది తరుచూ తన డిఫరెంట్ ఫొటోషూట్లతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తుంది. తాజాగా చేసిన షూట్ ఫొటోలు నెట్టింట దర్శణమివ్వడంతో అంతా షాకవుతున్నారు. కట్-అవుట్-అవుట్ డిజైన్ ప్రత్యేకంగా రూపొందించిన తెల్లటి టెక్స్చర్డ్ గౌన్‌లో వివిధ భంగిమల్లో బోల్డ్‌గా చేసిన ఫొటో షూట్ చూసే వారికి చాలా మందికి కనుల విందు చేయగా మరికొంత మంది మాత్రం డిస్ట్రబ్ అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ ఏంటి ఇలా చేస్తుంది. అవకాశాలు బాగానే ఉన్నాయి కదా ఇప్పుడు ఇలాంటి ప్రదర్శణలు ఎందుకు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదేం ఫొటోషూట్ రా.. ఇలా తయారేంట్రా అని విమర్శలు చేస్తున్నారు.

# 'మిత్ర మండలి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కి వెన్యూ ఖరారు



టాలీవుడ్ యువ నటుడు ప్రియదార్శి ఇటీవలే తన తదుపరి చిత్రాన్ని విజయేందర్ ఎస్ దర్శకత్వంలో చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి అందరికి తెలిసిందే. ఈ చిత్రానికి మూవీ మేకర్స్ 'మిత్ర మండలి' అనే టైటిల్ ని లాక్ చేసారు. రాగ్ మయూర్, విష్ణు ఓయి మరియు ప్రసాద్ బెహారా కూడా ఈ సినిమాలో ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో నిహారికా ఎన్ %వీ% మహిళా ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఈ సినిమా యొక్క ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగల్ మరియు టీజర్ మూవీ పై భారీ హైప్ ని సృష్టించాయి. ఈ సినిమా యొక్క ట్రైలర్ ని అక్టోబర్ 7న ఉదయం 11:07 గంటలకి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడిరచారు. తాజాగా ఇప్పుడు ఈ లాంచ్ ఈవెంట్ ఈరోజు ఉదయం 10 గంటల నుండి %AAA% సినిమాస్ లో నిర్వహిస్తున్నట్లు అంతేకాకుండా ఈ లాంచ్ ఈవెంట్ కి లిటిల్ హార్ట్స్ బృందం హాజరు కానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేసేందుకు ప్రొడక్షన్ హౌస్ సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసింది. ఈ సినిమాకి ఆర్ఆర్ ధ్రువన్ సంగీతాన్ని కంపోజ్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని బన్నీ వాస్ తన కొత్తగా ప్రారంభించిన బ్యానర్ బివి వర్క్స్ కింద ప్రదర్శిస్తున్నారు మరియు సప్త అస్వా మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ పై నిర్మాతలు కళ్యాణ్ మన్ మంతేనా, భను ప్రతాపా మరియు డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 16న విడుదల కానుంది.

Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in